కనీస మద్దతు ధరతో మొక్కజొన్న కొనుగోలు

- జిల్లా కలెక్టర్ ఏ.సిరి

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

కేంద్ర ప్రభుత్వం మొక్కజొన్నకు ప్రకటించిన కనీస మద్దతు ధరతో ట్రేడర్లు కొనుగోలు చేయాలని జిల్లా కలెక్టర్ ఎ.సిరి ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో వివిధ పంటలకు మార్కెటింగ్ చేసే అంశంపై జిల్లా కలెక్టర్ ట్రేడర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మొక్కజొన్నకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం క్వింటాలుకు రూ.2,400 కనీస మద్దతు ధరను నిర్ణయించిందని తెలిపారు. రైతులు పండించిన మొక్కజొన్నను ఈ ధరకు తగ్గకుండా కొనుగోలు చేయాలని ట్రేడర్లను ఆదేశించారు. రైతులకు ఎలాంటి నష్టం కలగకుండా చర్యలు తీసుకోవాలని, వ్యవసాయ, మార్కెటింగ్ అధికారులు ఈ అంశంలో పర్యవేక్షణ చేయాలని సూచించారు. రైతులకు తూకాల్లో మోసాలు జరగకుండా యంత్రాలను తనిఖీ చేయాలని అధికారులను ఆదేశించారు. ఇటీవల నిర్వహించిన తనిఖీల్లో తూకాల యంత్రాల్లో లోపాలు గమనించి సంబంధిత వారికి జరిమానాలు విధించామని తెలిపారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ నూరుల్ కమర్, జిల్లా వ్యవసాయ అధికారి వరలక్ష్మి, ఎల్‌డిఎం రామచంద్ర రావు, ఉద్యాన శాఖ అధికారి రాజ కృష్ణ రెడ్డి, మార్కెటింగ్ ఏడీ నారాయణమూర్తి, మార్కెట్ యార్డ్ సెక్రటరీ జయలక్ష్మి, ట్రేడర్లు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ ఎ.సిరి

కర్నూలు స్మార్ట్ సిటీ పనులకు ప్రణాళిక : కర్నూలును స్మార్ట్ సిటీగా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందించాలని జిల్లా కలెక్టర్ ఏ.సిరి అధికారులను ఆదేశించారు. కర్నూలు స్మార్ట్ సిటీ అంశంపై మున్సిపల్ కమిషనర్, సిబ్బందితో జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. నిరంతర తాగునీటి సరఫరా, అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ సిస్టం, పార్కులు, ఔటర్ రింగ్ రోడ్, ఫ్లై ఓవర్, రవాణా వ్యవస్థ, తదితర మౌలిక సదుపాయాలను ప్రణాళికలో చేర్చాలన్నారు. వీటిని ఏర్పాటు చేసేందుకు కేంద్ర ప్రభుత్వ పథకాలైన జల శక్తి, అమృత్, పిఎం గతిశక్తి, స్వచ్ఛ భారత్ మిషన్, స్వదేశీ దర్శన్, నేషనల్ గ్రీన్ ఎయిర్ తదితర పథకాలను వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అందుకనుగుణంగా డీటెయిల్ ప్రాజెక్ట్ రిపోర్ట్‌లు తయారు చేసి రాష్ట్ర ప్రభుత్వం ద్వారా కేంద్ర ప్రభుత్వానికి పంపించి నిధులు విడుదలయ్యే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. నగరంలో పచ్చదనం పెంపు, స్వచ్ఛమైన గాలి ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. తుంగభద్ర, హంద్రీ నది, కేసీ కెనాల్ పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో కర్నూలు మున్సిపల్ కమిషనర్ విశ్వనాథ్, ఇన్చార్జి సిటీ ప్లానర్ వెంకటరమణ, టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ అంజాద్ బాషా, డీఈలు గిరిరాజ్ పవన్, కుమార్ రెడ్డి, శ్రీనివాసన్, అసిస్టెంట్ ఇంజనీర్లు పాల్గొన్నారు.

ఆగని వలస బాట..!

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

పశ్చిమ ప్రాంతంలో వలసలు ఆగడం లేదు. తీవ్రమైన అతివృష్టి, అనావృష్టి పరిస్థితుల రీత్యా గ్రామాల్లో వ్యవసాయ పనులు లేక వ్యవసాయ కూలీలు, పేదలు సుదూర ప్రాంతాలకు వలస బాట పడుతున్నారు. వలసల నివారణలో ప్రభుత్వం, అధికారులు ఘోరంగా వైఫల్యం చెందుతున్నారు. గ్రామాల్లో సరైన పనులు లేక కుటుంబాలు గడవక గ్రామాలకు గ్రామాలు ఖాళీ అవుతున్నాయి. ఆయా గ్రామాల్లో వ్యవసాయ పనులు లేకపోవడంతో పేదలు, కూలీలు పొట్ట చేత పట్టుకొని తెలంగాణలోని నాగర్ కర్నూల్, మహబూబ్ నగర్, గుంటూరు, కర్ణాటక తదితర ప్రాంతాలకు వలసలు వెళ్తున్నారు. ఆయా ప్రాంతాలోల పత్తి, మిరప కోతలకు, హైదరాబాద్, బెంగళూరు, ముంబై వంటి నగరాల్లో భవన నిర్మాణ పనులకు తట్టా, బుట్టతో కుటుంబాలతో కలిసి వెళ్తున్నారు. ఇప్పటికే జిల్లాలో వేల సంఖ్యలో వలసబాట పట్టారు. పాఠశాలలో చదువుకునే పిల్లలను సైతం తల్లిదండ్రులు వెంట తీసుకెళు _న్నారు. విద్యార్థుల విద్యాభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని సీజనల్ హాస్టల్ ఏర్పాటు చేయడంలో పాలకులు, ప్రభుత్వం పూర్తిగా విఫలమయ్యారు. వలసల నివారణకు వెంటనే ఉపాధి హామీ పనులు కల్పించాలని, పెండింగ్‌లోని హంద్రీనీవా సాగు నీటి పంట కాలువ నిర్మాణాలు పూర్తి చేయాలని, సాగు నీరు అందించాలని పశ్చిమ ప్రాంత వాసులు కోరుతున్నారు.

మళ్లీ విష జ్వరాలు : ఉమ్మడి జిల్లాలో విష జ్వరాలు విజృంభిస్తున్నాయి. చిన్నపెద్దా అనే తేడా లేకుండా వాతావరణ మార్పులతో వైరల్ ఫీవర్స్‌తో ప్రతి ఒక్కరూ బాధపడుతు న్నారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా వారం రోజుల నుంచి ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులకు భారీగా కేసులు పెరుగుతున్నాయి. కర్నూలు, నంద్యాల, ఆదోని జీజీహెచ్‌ల్లో, ఎమ్మిగనూరు, బనగానపల్లె, ఆళ్లగడ్డ, డోన్, ఆత్మకూరు ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఓపీ రోగుల సంఖ్య గణనీయంగా పెరిగాయి. ఈ ఓపీ కేసుల్లో 60 శాతం వైరల్ ఫీవర్స్‌గా నమోదవు తున్నాయి. జ్వరం, దగ్గు, జలుబు, ఒళ్లు నొప్పులకు, గొంతునొప్పి లక్షణాలతో ప్రభుత్వ ఆసుపత్రులకు వస్తున్నారు. గత నెలతో పోలిస్తే వైరల్ ఫీవర్ కేసులు ఈనెల అధికంగా వస్తున్నాయి. ఇంట్లో ఒకరు తర్వాత మరొకరు విషజ్వరా లతో అల్లాడిపోతున్నారు. ప్లేట్‌లెట్స్ తగ్గిపోవడంతో నీరసించి ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో చేరుతున్నారు. జ్వరం తగ్గినా ఒళ్లు నొప్పులు, జలుబు, దగ్గు మాత్రమే తగ్గడం లేదని రోగులు మళ్లీ మళ్లీ ఆస్పత్రులకు క్యూ కడుతున్నారు.

కందికి 'దిత్వా' దెబ్బ : కంది పంట సాగుకు ఇప్పటి వరకు ఎకరానికి రూ.20 వేల నుండి రూ.25 వేల వరకు పెట్టుబడులు పెట్టారు. మొదట సకాలంలో వర్షాలు కురవడంతో కంది పంట ఏపుగా పెరిగింది. దీనికి తోడు పూత బాగా రావడంతో ఈ సంవత్సరం మంచి దిగుబడులు వస్తే అప్పులు తీర్చుకోవచ్చని కందిరైతులు ఎంతో సంబరపడ్డారు. పంట దెబ్బ తినకుండా రసాయన మందులు పిచికారి చేసి కాపాడుకున్నారు. దిత్వా తుఫాన్ ప్రభావంతో వాతావరణంలో మార్పులు చోటు చేసుకున్నాయి. ఎండలు లేకుండా మేఘాలు కమ్ముకుని ముసురు రావడంతో కంది పంటలో పూత మొత్తం రాలిపోతోంది. మరోపక్క పంటకు పురుగు ఉధృతి కూడా పెరిగిందని, పంట పూర్తిగా దెబ్బతింటుదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్ని మందులు పిచికారి చేసినా చీడపీడలు అదుపు కావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆరుగాలం కష్టపడి సాగు చేసిన పంట మొత్తం నాశనమైందని రైతులు ఆవేదనకు గురవుతున్నారు. తుఫాను రూపంలో ముసురు వచ్చి పంటను నాశనం చేసిందని రైతులు గగ్గోలు పెడుతున్నారు. ఎకరానికి 8 నుండి 10 బస్తాలు దిగుబడి రావాల్సిన కందులు తుఫాన్ ప్రభావంతో పూత రాలిపోవడంతో రెండు బస్తాలు కూడా వచ్చే పరిస్థితి కనపడడం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు కంది పంటను పరిశీలించాలని, పంటల బీమా వర్తింపజేసి పంట నష్టపరిహారం ఇచ్చి రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు.

అవీ..ఇవీ..అన్నీ..

జిల్లా వ్యాప్తంగా వికలాంగుల దినోత్సవం సందర్భగా పలు కార్యక్రమాలు నిర్వహించారు. మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ కార్యక్రమాన్ని జిల్లా వ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో నిర్వహించారు. ఎయిడ్స్ డే సందర్భంగా పలు ప్రాంతాల్లో అవగాహన ర్యాలీలు, సదస్సులు నిర్వహించారు.

రాజ్యాంగ రక్షణే అంబేద్కర్‌కు ఘన నివాళి

- డివైఎఫ్ఐ, కెవిపిఎస్, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో అంబేద్కర్ వర్ధంతి కార్యక్రమాలు

ప్రజాశక్తి - కర్నూలు క్రైమ్

రాజ్యాంగాన్ని రక్షించడమే డాక్టర్ బిఆర్ అంబేద్కర్‌కి ఘన నివాళి అని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రాఘవేంద్ర అన్నారు. శనివారం కర్నూలు మండలం అంబేద్కర్ నగర్, పసుపల గ్రామాల్లో డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహాలకు, చిత్రపటాలకు నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో రాజ్యాంగం ప్రమాదంలో పడిందన్నారు. వ్యక్తి స్వేచ్ఛను హరించివేస్తున్నారని అన్నారు. గత 10 సంవత్సరాలుగా దేశంలోని బిజెపి ప్రభుత్వం

అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లులర్పిస్తున్న నాయకులు

సామాజిక కార్యకర్తలను, విద్యార్థులను, కళాకారులను, సాహితీవేత్తలను, పాత్రికేయులపై రాజద్రోహం ఆరోపణలు మోపి నేరకృత కేసులు పెట్టి జైల్లో నిర్బంధించారన్నారు. తీవ్రమైన నేరాలు చేసి జైల్లో ఉండాల్సిన వాళ్లను విడుదల చేసి సత్కారాలు చేశారని విమర్శించారు. స్వతంత్రంగా పని చేయాల్సిన అనేక కేంద్ర సంస్థలను బలహీనపరిచి, తన గుప్పెట్లో రాష్ట్ర ప్రభుత్వాలపై దాడి చేస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. రాజ్యాంగంలో అనేక సవరణలు చేస్తూ ఒక్కొక్క పేజీని చించేస్తున్నారని అన్నారు. అనేక సందర్భాలలో దేశం కోసం ప్రాణాలు ఇచ్చిన వారిని, జీవితం త్యాగం చేసిన వారిని అవమానిస్తున్నారని పేర్కొన్నారు. రాజ్యాంగాన్ని బలహీనపరిచే కుట్ర దేశంలో జరుగుతుందన్నారు. ఈ సమయంలో రాజ్యాంగాన్ని కాపాడుకుని రాజ్యాంగ హక్కులను ప్రతి పౌరునికి చేరవేసి అసమానతలు లేని సమాజాన్ని నిర్మించడమే అంబేద్కర్‌కి ఘనమైన నివాళి అన్నారు. కార్యక్రమంలో బీసన్న, మస్తాన్, శంకర్, మధు, పృథ్వి, సంజీవ కృష్ణ, ప్రభాకర్, సుందరాజు, యేసు, హుస్సేనయ్య తదితరులు పాల్గొన్నారు.

కర్నూలు కార్పొరేషన్ : అంబేద్కర్ జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలని కెవిపిఎస్ నగర అధ్యక్షులు ఆర్.రమణ తెలిపారు. నగరంలోని జొహరాపురంలో డాక్టర్ బిఆర్.అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నగర నాయకులు సి.నాగరాజు అధ్యక్షత వహించారు. ఆర్.రమణ, కెవిపిఎస్ నగర ఉపాధ్యక్షులు ఎం.విజయ రామాంజనేయులు మాట్లాడుతూ... అంబేద్కర్ దేశాభివృద్ధి కోసం అన్ని మతాలకు, కులాలకు సమానంగా హక్కులు రావాలని రాజ్యాంగంలో పొందుపరిచారని తెలిపారు. ఆటో యూనియన్ నగర కార్యదర్శి మహమూద్, కెవిపిఎస్ నగర నాయకులు రంగస్వామి, మాసుమ్, మధు, సుధాకర్, మౌలాలి, విక్రం, ఎర్రమల పాల్గొన్నారు. **కర్నూలు (క్రైమ్)** నగరంలోని ధర్మపేట అంబేద్కర్ సర్కిల్‌లో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రజా చైతన్య పార్టీ కార్యదర్శి క్రాంతి కుమార్, నాయకులు అబ్దుల్లా, షఫీ, బాలస్వామి, అడ్వకేట్ చిన్నయ్య, ప్రభు, ప్రసాద్, కెడిసిసి మాజీ డైరెక్టర్ సుధాకర్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కెవిపిఎస్ నాయకులు

ప్రభుత్వ విద్యారంగ బలోపేతానికి పోరాటం : ఎస్ఎఫ్ఐ

- జిల్లా నూతన కమిటీ ఎన్నిక
- జిల్లా అధ్యక్ష కార్యదర్శులుగా సాయి ఉదయ్, రంగప్ప

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

ప్రభుత్వ విద్యా రంగం బలోపేతం కోసం, ప్రైవేటు విద్యాసంస్థల దోపిడీని అరికట్టేందుకు ఉధృత పోరాటాలు చేయాల్సిన అవసరం ఉందని ఎస్ఎఫ్ఐ నేతలు పేర్కొన్నారు. ఈ నెల 4, 5వ తేదీల్లో ఆలూరులో జరిగిన ఎస్ఎఫ్ఐ కర్నూలు జిల్లా 50వ స్వర్ణోత్సవ మహాసభల్లో జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ నేపథ్యంలో శనివారం కర్నూలు నగరంలోని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించి నూతన కమిటీ వివరాలు వెల్లడించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడిగా సాయి ఉదయ్, కార్యదర్శిగా రంగప్ప, ఉపాధ్యక్షులుగా శ్రీనివాసులు, సంయుక్త, అంజి, శశిధర్, జిల్లా సహాయ కార్యదర్శిగా ఆర్యన్, రాము, ఉమేష్, వినోద్, ఆహ్వానితునిగా అబుబక్కర్‌తో పాటు 14 మందిని జిల్లా కమిటీ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ కర్నూలు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సాయి ఉదయ్, రంగప్ప మాట్లాడుతూ ఎస్ఎఫ్ఐ జిల్లా 50వ స్వర్ణోత్సవ మహాసభలో ప్రభుత్వ విద్యా రంగం బలోపేతం కోసం, ప్రైవేటు విద్యాసంస్థల దోపిడీని అరికట్టేందుకు ఎలాంటి పోరాటాలు చేయాలి, పోరాటాల్లో విద్యార్థులను కూడా భాగస్వామ్యం చేయాలనే చర్చలు జరిగాయన్నారు. ఆదోని మెడికల్ కాలేజీని ప్రైవేటీకరణ రద్దు చేయాలని, జిల్లాలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో కళాశాలలో మౌలిక వసతులు కల్పించాలని, ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం వసతిని కల్పించాలని మహాసభ తీర్మానించిందన్నారు. రాయలసీమ యూనివర్సిటీ ఉర్దూ యూనివర్సిటీ క్లస్టర్ యూనివర్సిటీలో అధ్యాపక పోస్టులు భర్తీ చేయాలని తీర్మానాలు చేశామన్నారు. రాబోయే కాలంలో ఈ తీర్మానాలపై ఎస్ఎఫ్ఐ పోరాటాలు నిర్వహిస్తుందన్నారు.

మాట్లాడుతున్న జిల్లా నూతన అధ్యక్ష కార్యదర్శులు సాయి ఉదయ్, రంగప్ప

ప్రజా కళలను ప్రోత్సహిద్దాం

- సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

ప్రజా కళలను ప్రోత్సహించాలని, ప్రజలలో దాగి ఉన్న కళలను బయటికి తీసి వాటిని ప్రదర్శించడం ద్వారా కళలను రక్షించడానికి కృషి చేయాలని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు పిలుపునిచ్చారు. ఈ నెల 31 నుండి 2026 జనవరి 4వ తేదీ వరకు విశాఖపట్నంలో జరుగుతున్న సిఐటియు ఆలిండియా మహాసభల సందర్భంగా నిర్వహిస్తున్న సాంస్కృతిక ఉత్సవాలను జయప్రదం చేయడం కోసం రాయలసీమ జిల్లాల కళాకారుల వర్క్ షాప్‌ను శనివారం కర్నూలు నగరంలోని కార్మిక కర్షక భవన్‌లో ప్రారంభించారు. అనంతరం సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి.అంజిబాబు అధ్యక్షతన జరిగిన ప్రారంభ సభలో ఆయన మాట్లాడారు. శ్రమయే సర్వ సంపదలకు మూలమనే అంశాన్ని మహాసభల సందర్భంగా విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్తున్నట్లు తెలిపారు. శ్రమ మొత్తాన్ని ఈ రోజు కార్పొరేట్ సంస్థలు దోచుకుంటున్నాయని అన్నారు. పాలకులు వారికి అండగా ఉంటూ శ్రమ దోపిడీకి సహకరిస్తున్నారని విమర్శించారు. ప్రజా కళల ద్వారా శ్రమశక్తి విలువ ఏమిటో శ్రామికులకు తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. శ్రామికులు ఐక్యంగా ఉండడానికి ఇష్టపడని పాలకులు మతం, కులం పేరుతో విభజించే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. శ్రామికులందరినీ ఐక్యం చేసే పని కళల ద్వారా కళాకారులు చేయాల్సిన కర్తవ్యం మరింతగా పెరిగిందని తెలిపారు. సమావేశంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు పిఎస్ రాధాకృష్ణ, ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి నాగరాజు, జిల్లా అధ్యక్షులు బసవరాజు, అనంతపురం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, కడప కార్యదర్శి రమణ, కర్నూలు జిల్లా నాయకులు లోకేష్, నాగ సుంకన్న, బతకన్న, నోమేశ్వరి, సుబ్బరాయుడు, సరిత, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు

అట్టడుగు వర్గాల ఆశాజ్యోతి అంబేద్కర్

- టిడిపి జిల్లా అధ్యక్షులు తిక్కారెడ్డి

ప్రజాశక్తి - కర్నూలు క్రైమ్

అట్టడుగు వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బిఆర్.అంబేద్కర్ అని టిడిపి జిల్లా అధ్యక్షులు పాలకుర్తి తిక్కారెడ్డి, పత్తికొండ ఎమ్మెల్యే కేఈ.శ్యాంబాబు తెలిపారు. శనివారం కర్నూలు నగరంలోని పాత బస్టాండ్ దగ్గర ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ... సమాజంలో అట్టడుగు వర్గాల వారి అభ్యున్నతికి రాజ్యాంగంలో అవకాశాలు కల్పించారని తెలిపారు. అలాగే టిడిపి జిల్లా కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి పాల్గొని అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మాదిగ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ ధరూరు జేమ్స్, టిడిపి నాయకులు సత్రం రామకష్ణ, రాజు, నాయకులు పాల్గొన్నారు. భారత రాజ్యాంగ శిల్పి, మహానుభావుడు, భారత ప్రజాస్వామ్యానికి దారిదీపంగా నిలిచిన అంబేద్కర్ చూపిన మార్గం అనుసరణీయమని జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి బి రాధిక అన్నారు. అంబేద్కర్ వర్ధంతిని సాంఘిక సంక్షేమ శాఖ కర్నూలు జిల్లా కార్యలయంలో నిర్వహించి, నివాళులర్పించారు. **కర్నూలు (హాస్పిటల్)**లోని అశోక్ నగర్ రాయలసీమ మహిళ సంఘ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పట్టణ నిరాశ్రయుల వసతి గృహంలో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రాయలసీమ మహిళా సంఘ్ అధ్యక్షులు, బీసీ సంక్షేమ సంఘ్ రాష్ట్ర కార్యదర్శి శకుంతల, వసతి నిరాశ్రయ మహిళలు గౌతమి పాల్గొన్నారు. **మద్దికెర** పోలీసు స్టేషన్ సమీపాన ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంఆర్‌పిఎస్ నాయకుడు పారా రాఘవేంద్ర, ఉసేని, బండారు అంజి, కవి దాస్, రమేష్ పాల్గొన్నారు. **కర్నూలు (కలెక్టరేట్)**లోని రాయలసీమ విశ్వవిద్యాలయంలో అంబేద్కర్ విగ్రహానికి వైస్ ఛాన్సలర్ వెంకట బసవరావు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. వర్సిటీ కాలేజి ప్రిన్సిపల్ సి.విశ్వనాథరెడ్డి, ఆర్.భరత్ కుమార్, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. క్లస్టర్ విశ్వవిద్యాలయంలోని సిల్వర్ జూబ్లీ కళాశాలలో అంబేద్కర్ విగ్రహానికి వీసీ వెంకట బసవరావు, రిజిస్ట్రార్ డాక్టర్ జి.శ్రీనివాస్ నివాళులర్పించారు. విశ్వవిద్యాలయ డీన్లు డాక్టర్ నాగరాజ్ శెట్టి, డాక్టర్ అక్తర్ భాను, డాక్టర్ మహమ్మద్ వాహీజ్, పాల్గొన్నారు. అలాగే జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్సీ సుధాకర్ బాబు, కోడుమూరు కోఆర్డినేటర్ అనంతరత్నం మాదిగ, ఐఎన్‌టియుసి రాష్ట్ర అధ్యక్షులు సయ్యద్ ఖాద్రి పాషా, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు యన్‌సి బజారన్న, ఐఎన్టియుసి జిల్లా అధ్యక్షులు బి బతుకన్న, మైనార్టీ సెల్ జిల్లా చైర్మన్ షేక్ ఖాజా హుస్సేన్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు బి.మహేంద్ర నాయుడు అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. **కోడుమూరు** మండలంలోని అంపయ్య సర్కిల్‌లో అంబేద్కర్ విగ్రహానికి మాల మహానాడు ఆధ్వర్యంలో నివాళు లర్పించారు. మాల మహానాడు జిల్లా ప్రధాన కార్యదర్శి బిరుకుల మునిస్వామి, కె.సింగరయ్య, కె.భీముడు, ఎస్.తిక్కన్న, కొప్పుల రాజు, బట్టి దాసు, కాలవ గడ్డి హరి, మల్లయ్య, మాల శీను, తొలిసాపురం రంగమని పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న వీసీ

'స్క్రబ్ టైఫస్' మనిషి నుంచి మనిషికి వ్యాపించదు

- భయపడాల్సిన అవసరం లేదు - కలెక్టర్ సిరి

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

స్క్రబ్ టైఫస్ వ్యాధి మనిషి నుంచి మనిషికి వ్యాపించదని, ప్రజలు భయపడాల్సిన అవసరం లేదని కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి తెలిపారు. శనివారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో కలెక్టర్ స్క్రబ్ టైఫస్ వ్యాధి గురించి వైద్య బృందంతో సమీక్ష నిర్వహించారు. వ్యాధి వ్యాప్తి గురించి కలెక్టర్ ఆరా తీశారు. నవంబర్ నెల, ఇప్పటి వరకు 44 పాజిటివ్ కేసులు వచ్చాయని, అందరికీ చికిత్స అందించామని, 39 మంది రోగులు డిశ్చార్జ్ అయ్యారని, ప్రస్తుతం ఐదుగురు ఆస్పత్రిలో ఉన్నారని జిజిహెచ్ సూపరింటెండెంట్ వివరించారు. కలెక్టర్ మాట్లాడుతూ...స్క్రబ్ టైఫస్ వ్యాధి తీవ్రమైనది కాదని, తక్షణ చికిత్సతో పూర్తిగా నయం అవుతుందని తెలిపారు. అధిక జ్వరం, తలనొప్పి, శరీరనొప్పులు, దద్దుర్లు, కాటు దగ్గర నల్లరంగు పట్టు (ఎస్కార్) లక్షణాలు ఉంటాయని, వెంటనే సమీప పిహెచ్‌సిని సంప్రదించాలని సూచించారు. జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వర్లు, జనరల్ మెడిసిన్ హెచ్ఓడి డాక్టర్ శ్రీరాములు, చిన్నపిల్లల విభాగపు హెచ్ఓడి డాక్టర్ విజయానంద్ బాబు, పల్మనాలజీ హెచ్ఓడి డాక్టర్ శ్రీకాంత్, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ ఉమాదేవి పాల్గొన్నారు.

అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ సిరి

కర్నూలు కలెక్టరేట్ : ఉగాది నాటికి జిల్లాకు నిర్దేశించిన 14 వేల ఇంటి నిర్మాణాలను పూర్తి చేయాలని కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి అధికారులను ఆదేశించారు. నియాజకవర్గ స్పెషల్ ఆఫీసర్, తహశీల్దార్లు, ఎంపిడిఒలు, మున్సిపల్ కమిషనర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలో ప్రధానమంత్రి ఆవాస్ యోజన గ్రామీణ్ సర్వేలో భాగంగా మొత్తం 30,980 గృహాలను సర్వే చేయడం పూర్తయిందన్నారు. హౌసింగ్ పీడీ చిరంజీవి, జడ్‌పి సిఇఒ నాసర రెడ్డి, పత్తికొండ ఆర్‌డిఒ భరత్ నాయక్, డ్వామా పీడీ వెంకటరమణయ్య పాల్గొన్నారు.

హెచ్‌ఒడిలను రొటేషన్ చేయాలి

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

కర్నూలు మెడికల్ కాలేజీలో విభాగాధిపతులను రొటేషన్ చేయాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ డాక్టర్స్ అసోసియేషన్ (ఏపీజిడిఏ) ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షులు డాక్టర్ పి. బ్రహ్మాజీ మాస్టర్, నాయకులు ప్రొఫెసర్ డాక్టర్ రామ్ శివ నాయక్, ప్రొఫెసర్ డాక్టర్ సుధీర్, హెచ్‌ఒడి ప్రొఫెసర్ డాక్టర్ సుధారాణి శనివారం కెఎంసి ప్రిన్సిపల్ డాక్టర్ కె.చిట్టి నరసమ్మకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్‌యంసి నిబంధనల మరియు ఆంధ్రప్రదేశ్ డిఎంఇ మౌఖిక సూచనల ప్రకారం ప్రతి 3 సంవత్సరాలకు విభాగాధిపతులను రొటేషన్ చేయాలని దేశంలోని అన్ని మెడికల్ కాలేజీలలో రొటేషన్ సిస్టమ్ ని అమలు చేస్తున్నారని అన్నారు. కర్నూలు మెడికల్ కాలేజీలో కూడా అమలు చేయాలని వారు కోరారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కె చిట్టి నరసరమ్మ మాట్లాడుతూ వచ్చిన వినతి పత్రాన్ని డీఎంఈకి పంపుతామని తెలిపారు.

వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఇన్ఫినిటి మినరల్స్ పర్యావరణ ప్రజా విచారణ

ప్రజాశక్తి - వెల్దుర్తి : మండలంలోని బుక్కాపురం గ్రామ పరిధిలో ఇన్ఫినిటీ మినరల్స్ సంస్థ ప్రతిపాదించిన క్వార్జ్ మైనింగ్ ప్రాజెక్టుపై పర్యావరణ ప్రజా విచారణ శనివారం నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో స్థానిక రైతులు, ప్రజా ప్రతినిధులు పాల్గొని తమ అభిప్రాయాలు వెల్లడించారు. సర్వే నెంబర్ 214 (బ్లాక్-1) లో 4.5 హెక్టార్ల విస్తీర్ణంలో ప్రతిపాదిత తవ్వకాల ద్వారా 1,11,393, అలాగే 13,403 టన్నుల వ్యర్థం ఉత్పత్తయ్యే అవకాశం ఉందని అధికారులు వివరించారు. ఆర్‌డిఒ సందీప్ కుమార్ ఛైర్మన్‌గా వ్యవహరించారు. తహశీల్దార్ చంద్రశేఖర వర్మ, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఇంజనీర్ కిషోర్ రెడ్డి హాజరయ్యారు. ప్రాజెక్టు ప్రభావం, భూగర్భ జలాలపై ఉండే ప్రభావం, ప్రశ్నలు లేవనెత్తగా, అధికారులు స్పందించారు. ప్రజల అభిప్రాయాలను పర్యావరణ అనుమతుల పరిశీలనలో భాగంగా పరిగణనలోకి తీసుకుంటామని అధికారులు తెలిపారు.

సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

హోంగార్డుల విధులు, సేవలు ప్రశంసనీయం

- ఎస్పీ విక్రాంత్ పాటిల్
- క్రీడా విజేతలకు బహుమతులు ప్రధానం

ప్రజాశక్తి - కర్నూలు క్రైమ్

శాంతిభద్రతల పరిరక్షణలో హోంగార్డుల విధులు, సేవలు ప్రశంసనీయమని ఎస్పీ విక్రాంత్ పాటిల్ తెలిపారు. కర్నూలు జిల్లా పోలీసు పరేడ్ మైదానంలో శనివారం 63వ హోంగార్డుల ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. ఎస్పీ విక్రాంత్ పాటిల్ ముఖ్య అతిథిగా హాజరయి సాయుధ హోంగార్డుల ప్లటూన్ల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం పరేడ్ పరిశీలన వాహనంపై వెళ్లి ప్లటూన్లను పరిశీలించారు. ఎస్పీ విక్రాంత్ పాటిల్ మాట్లాడుతూ... పోలీసులతో సమానంగా హోంగార్డులు సేవలు అందిస్తుండడం అభినందనీయమ న్నారు. 1963వ సంవత్సరంలో ఆవిర్భవించిన హోంగార్డు వ్యవస్థ పోలీసుశాఖలో కీలకంగా మారిందన్నారు. అన్ని విభాగాలు, బందోబస్తు విధుల్లో బాగా పని చేస్తున్నారని తెలిపారు. క్రమ శిక్షణతో మెలిగి పోలీసు ప్రతిష్టను పెంచేలా విధులు నిర్వర్తించాలన్నారు. అనంతరం హోంగార్డులకు నిర్వహించిన స్పోర్ట్స్ మీట్‌లో గెలుపొందిన వారికి ఎస్పీ బహుమతులు ప్రదానం చేశారు. ఉద్యోగ విరమణ పొందిన (శ్రీనివాస శెట్టి, శేషమ్మ, వీరమ్మ, హసినా బేగం) నలుగురు హోంగార్డులను ఎస్పీ శాలువా, పూలమాలతో సన్మానించారు. ఒక్కొక్కరికి రూ.2 లక్షల కాంట్రిబ్యూషన్ ఫండ్ చెక్కులను అందజేశారు. అడిషనల్ ఎస్పీ అడ్మిన్ హుస్సేన్ పీరా, ఎఆర్ అడిషనల్ ఎస్పీ కృష్ణ మోహన్, కర్నూలు డీఎస్పీ బాబు ప్రసాద్, మహిళా పిఎస్ డీఎస్పీ ఉపేంద్ర బాబు, హోంగార్డ్ డీఎస్పీ ప్రసాద్, పోలీసు వేల్ఫేర్ హాస్పిటల్ డాక్టర్ స్రవంతి, సిఐలు మధుసూదన్ రావు, చంద్రబాబు నాయుడు, నాగరాజా రావు, మన్సూరుద్దీన్, ఆర్ఐలు పోతల రాజు, జావేద్, నారాయణ, ఆర్ఎస్ఐలు మహేశ్వరరెడ్డి, హుస్సేన్, ప్రదీప్, కల్పన, మహాలక్ష్మి ఉన్నారు.

హోంగార్డులను సన్మానిస్తున్న ఎస్పీ

అభివృద్ధి పనులకు భూమిపూజ చేసి శిలఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

పలు అభివృద్ధి పనులకు భూమి పూజ

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే గౌరు చరితరెడ్డి శనివారం భూమిపూజ చేశారు. కల్లూరు అర్బన్ 21వ వార్డు ఎన్‌జిఒస్ కాలనీ, ఎఫ్‌సిఐ కాలనీ-2లో రూ.1.40 కోట్ల విలువ గల సిసి రోడ్లు, డ్రెయిన్లు, డబ్ల్యుబిఎం రోడ్డు, 20వ వార్డు వాసవి నగర్, జయరాం నగర్‌లో రూ.50 లక్షలతో సిసి రోడ్, 26వ వార్డ్ సవారమ్మ కాలనీలో రూ.82 లక్షలతో సిసి రోడ్లు, డ్రెయినేజీ నిర్మాణం, 35వ వార్డు ఉమా మహేశ్వర నగర్, కల్లూరు ఎస్టేట్ నాగుల కట్టలో రూ.67 లక్షలతో డబ్ల్యుబిఎం రోడ్డు బిటి రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేశారు. నగరపాలక కమిషనర్ పి.విశ్వనాథ్, మార్కెట్ యార్డ్ మాజీ ఛైర్మన్ పెరుగు పురుషోత్తం రెడ్డి, విశ్వ బ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ కె.పార్వతమ్మ, తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ యాదవ్, ఓర్వకల్లు మండల కన్వీనర్ బ్రాహ్మణపల్లె నాగిరెడ్డి, తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షులు జవ్వాజి గంగాధర్ గౌడ్, క్లస్టర్ ఇన్‌ఛార్జీ చరణ్ కుమార్ యాదవ్, భీసన్న, వెంకటస్వామి, శ్రీను, రవి, సతీష్, రవి ప్రకాష్ రెడ్డి, ఎల్ల నాగన్న, రాములమ్మ పాల్గొన్నారు.

'సెయింట్ క్లారెట్'లో సోలార్ సిస్టమ్ ప్రదర్శన

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

కర్నూల్ నగరంలోని సెయింట్ క్లారియట్ స్కూల్లో విద్యార్థులకు సోలార్ సిస్టం ప్రదర్శనను నిర్వహించారు. ఈ ప్రదర్శనను స్కూల్ ప్రిన్సిపల్ ఆనందరాజు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఇలాంటి ప్రదర్శనలు విద్యార్థుల్లో సైంటిఫిక్ ఆలోచనలను, సజనాత్మకతను పెంచడానికి ఉపయోగపడతాయని అన్నారు. ఈ ప్రదర్శనలో సోలార్ సిస్టమ్, ప్లానిటోరియం త్రీడీ వ్యూ ఎక్స్‌పీరియన్స్, డైనోసార్స్ ఫిష్ అక్వేరియం వంటి ప్రదర్శనలను ఇందులో ఉంచారని అన్నారు. 40 నిమిషాల పాటు జరిగే ఒక షో నిర్వహించామని పది షోలలో 1118 మంది విద్యార్థులు తిలకించాలని తెలిపారు.

రాతనలో ఎన్‌టిఆర్ విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి - పత్తికొండ



తుగ్గలి మండలం రాతన గ్రామంలో మాజీ సర్పంచి మనోహర్ చౌదరి ఆధ్వర్యంలో టిడిపి జిల్లా అధ్యక్షులు తిక్కా రెడ్డి, ఎమ్మెల్యే కేఈ.శ్యామ్ కుమార్, మోహన్ రూప చేతుల మీదుగా టిడిపి వ్యవస్థాపకులు కీర్తిశేషులు ఎన్‌టి.రామారావు విగ్రహాన్ని శనివారం ఆవిష్కరించారు. ఎమ్మిగనూరు ఎమ్మెల్యే జయ నాగేశ్వర్ రెడ్డి, మంత్రాలయం ఇన్‌ఛార్జి రాఘవేంద్ర రెడ్డి, ఆదోని మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు, మాజీ శాలివాహన ఫెడరేషన్ చైర్మన్ తుగ్గలి నాగేంద్ర, ఆలూరు ఇన్‌ఛార్జీ వైకుంఠం జ్యోతి పాల్గొన్నారు.

మున్సిపాలిటీలో కారుణ్య నియామకాలు

- ఎమ్మెల్యే బీవీ

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు


సర్క్యులర్‌ను చూపుతున్న ఎమ్మెల్యే బీవీ

ఎమ్మిగనూరు మున్సిపాలిటీలో మున్సిపల్ కార్మికులుగా పని చేస్తూ మృతి చెందిన 13 మంది కుటుంబాల సభ్యులకు కారుణ్య నియామకాలకు ప్రభుత్వం ఆమోదం తెలిపినట్లు ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయనాగేశ్వర రెడ్డి పేర్కొన్నారు. శనివారం ప్రభుత్వం విడుదల చేసిన సర్క్యులర్‌ను ఎమ్మెల్యే డాక్టర్ బీవీ ఆయా కుటుంబాలతో కలిసి మీడియా ముందు ప్రదర్శించారు. ఆయన మాట్లాడుతూ... ఐదేళ్ల క్రితమే కారుణ్య నియామకాలపై ప్రతిపాదనలు పంపించినా గత ప్రభుత్వం పట్టించుకోకుండా ఉదాసీనంగా వ్యవహరించిందని తెలిపారు. నాటి నుంచి పెండింగ్‌లో ఉన్న ఈ అంశాన్ని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. సానుకూలంగా స్పందించిన కలెక్టర్ కారుణ్య నియామకాలకు ఆమోదం తెలిపారన్నారు. ఎమ్మెల్యే బీవీకి రుణపడి ఉంటామని కుటుంబ సభ్యులు తెలిపారు.

300 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇవ్వాలి

- చేనేత కార్మిక సంఘం నాయకులు

మాట్లాడుతున్న భరణి కాళ్లప్ప

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

చేనేత కార్మికులకు 300 యూనిట్ల ఉచిత విద్యుత్‌ను ఇవ్వాలని ఆంధ్ర ప్రదేశ్ చేనేత కార్మిక సంఘం పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు కె.లక్ష్మన్న, భరణి కాళ్లప్ప డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోనిసుందరయ్య భవన్‌లో చేనేత కార్మిక సంఘం సమావేశం కామర్తి లక్ష్మన్న అధ్యక్షతన నిర్వహించారు. వారు మాట్లాడుతూ... కూటమి ప్రభుత్వం చేనేత కార్మికులకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ హామీని పట్టణంలో అమలు చేయకపోవడంతో చేనేత కార్మికులు ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. ప్రతి చేనేత కార్మికునికీ మూడు సెంట్ల స్థలంతో షెడ్డు నిర్మించి ఇవ్వాలని కోరారు. సొంత స్థలం ఉన్న చేనేత కార్మికునికి ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందించాలని తెలిపారు. సిఐటియు నాయకులు గోవిందు, రాముడు, చేనేత కార్మిక సంఘం కార్యకర్తలు గడిగే శీను, మోనే తిమ్మప్ప, చాయ శ్రీనివాసులు, మాదగుండు రాఘవేంద్ర, కెంచుగుండి శీను, మాదుగుండు నగేష్, బుగిడే బడే సాబ్, గడిగే వెంకటేష్, కనికె నాగరాజు, గడిగే బసవరాజు పాల్గొన్నారు.

జిల్లా సాధన ఉద్యమం తీవ్రం

- పశ్చిమ ప్రాంత అభివృద్ధికి ఆదోని జిల్లా చేయాల్సిందే

- బోయ/వాల్మీకి సంఘం సంఘీభావం

ప్రజాశక్తి - ఆదోని

పశ్చిమ ప్రాంతం అభివృద్ధి చెందాలంటే ఆదోనిని జిల్లా చేయాలని జిల్లా సాధన సమితి జెఎసి నాయకులు రఘురామయ్య, లలిత, కృష్ణమూర్తి గౌడ్, వీరేష్, కోదండ, తిరుమల, కుంకనూరు వీరేష్, దస్తగిరి తెలిపారు. ఆదోని జిల్లా సాధనకు కోట్ల కూడలిలో చేపట్టిన రిలే దీక్షలు శనివారం 21వ రోజుకు చేరుకుంది. రియల్ ఎస్టేట్ వ్యాపారులు మహ్మద్ ఆయుబ్, మహ్మద్ సాధిక్, ఖాజాసాబ్, ప్రధానోపాధ్యాయులు బాష, ఫయాజ్ పటేల్, నూర్ దీక్షలో కూర్చున్నారు. ఎపిఎన్‌జిఒ అధ్యక్షులు ఉషారాణి ఆధ్వర్యంలో బోయ/వాల్మీకి సంఘం రాష్ట్ర అధ్యక్షులు క్రాంతి నాయుడు నేతృత్వంలో సంఘీభావం తెలిపారు. వారు మాట్లాడుతూ... ఆలూరు, మంత్రాలయం, పత్తికొండ, ఎమ్మిగనూరు, ఆదోని మారుమూల ప్రాంతాల నుంచి కర్నూలుకు వెళ్లాలంటే 170 కిలోమీటర్లకు పైగా వెళ్లాల్సి వస్తుందని తెలిపారు. ఇప్పటికే ఐదు నియోజకవర్గాలు వెనుకబాటుతనానికి గురయ్యాయని చెప్పారు. కూటమి ప్రభుత్వం ప్రజల ఆకాంక్షను నెరవేర్చాలని కోరారు. వాల్మీకి సంఘం నాయకులు అర్జున్, వీరేష్, దుర్గేష్, నాగరాజు, వీరారెడ్డి, సురేష్, సుధాకర్, కల్లుబావి రాజు పాల్గొన్నారు.

ప్రజల ఆకాంక్షను బాబుకు వివరిస్తాం : మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు

ఐదు నియోజకవర్గాల ఎమ్మెల్యేలతో పాటు జెఎసి నాయకులు ప్రతిపక్ష, ప్రజా సంఘాలను కలుపుకొని తమ మంత్రులు జోన్ 5 ఇన్‌ఛార్జీ ఎంపీలతో కలిసి చర్చించాక త్వరలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దగ్గరికి వెళ్తామని మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు తెలిపారు. నాయకులు మీనాక్షి నాయుడు స్వగృహంలో కలిసి ఆదోని జిల్లా సాధనపై చర్చించారు.


మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడుతో చర్చిస్తున్న నాయకులు

ఫిబ్రవరి చివరి వరకు

దిగువ కాలువకు సాగునీరివ్వాలి

- రైతు సంఘం జిల్లా అధ్యక్షులు వెంకటేశులు

ప్రజాశక్తి - కౌతాళం

తుంగభద్ర దిగువ కాలువకు ఫిబ్రవరి చివరి వరకు సాగునీరు అందించాలని రైతుసంఘం జిల్లా అధ్యక్ష, ఉపాధ్యక్షులు కె.వెంకటేశులు, మల్లయ్య డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని తుంగభద్ర దిగువ కాలువ కింద సాగు చేసిన మిరప పంటను పరిశీలించి రైతులతో మాట్లాడారు. నాయకులు మాట్లాడుతూ... జిల్లాలోని ఆలూరు, ఆదోని, మంత్రాలయం, ఎమ్మిగనూరు నియోజకవర్గాల పరిధిలోని రైతులు వేల ఎకరాల్లో మిరప పంటను సాగు చేశారని తెలిపారు. మిరప పంట ఇప్పుడిప్పుడే పూత దశలో ఉందని, ఇలాంటి సమయంలో జనవరి 10వ తేదీన తుంగభద్ర దిగువ కాలువకు సాగునీటి సరఫరాను నిలిపి వేస్తున్నట్లు అధికారులు ప్రకటించడం సరైన పద్ధతి కాదని చెప్పారు. మిరప పంట చేతికి రాకుండా రైతులు ఆర్థికంగా తీవ్రంగా నష్టపోతారన్నారు. ఎకరాకు రూ.లక్షకు పైగా రైతులు పెట్టుబడులు పెట్టారని, మిరప పంట రైతులకు అందాలంటే కనీసం ఫిబ్రవరి చివరి వరకు సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే అధిక వర్షాలతో రైతులు నష్టపోయారని, ఏ రైతును అడిగినా ఫిబ్రవరి చివరి వరకు సాగునీరు కావాలని తమ దృష్టికి తీసుకొచ్చారని తెలిపారు. జనవరి 10వ తేదీన ఎల్ఎల్‌సికి సాగునీటిని నిలిపి వేస్తే, మిరప పంట సాగు చేసిన రైతులు అప్పులపాలై, అప్పుల భారంతో ఆత్మహత్యలు చేసుకునే ప్రమాదం ఉందని చెప్పారు. జిల్లా మంత్రులు, జిల్లా అధికారులు స్పందించి మిరప పంట సాగు చేసిన రైతులకు ఫిబ్రవరి చివరి వరకు సాగునీరు అందించి ఆదుకోవాలని కోరారు. రైతుసంఘం మండల కన్వీనర్ ఈరన్న, మిరప రైతులు పాల్గొన్నారు.


మిరప పంటను పరిశీలిస్తున్న నాయకులు

చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపిడిఒ

విధుల పట్ల అలసత్వం వహిస్తే చర్యలు

- ఎంపిడిఒ జ్యోతి

ప్రజాశక్తి - దేవనకొండ

గ్రామ సచివాలయ సిబ్బంది విధుల పట్ల అలసత్వం వహిస్తే చర్యలు తీసుకుంటామని ఎంపిడిఒ జ్యోతి హెచ్చరించారు. శనివారం దేవనకొండలోని గ్రామ సచివాలయాలను ఆమె సందర్శించి సిబ్బంది రిజిస్టర్‌ను తనిఖీ చేశారు. చెత్త సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించి పొడి, తడి చెత్తను వేరు చేసే విధానాన్ని పారిశుధ్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఎస్సీ కాలనీ, సంత మార్కెట్ వీధిలోని అంగన్వాడీ కేంద్రాలను పరిశీలించారు. చిన్నారులకు అందిస్తున్న పౌష్టికాహారాన్ని తనిఖీ చేశారు. అపరిశుభ్రత వాతావరణం లేకుండా చూసుకోవాలని సూచించారు. డిప్యూటీ ఎంపిడిఒ రఫీ, పంచాయతీ కార్యదర్శి రాముడు యాదవ్ పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

ప్రజాశక్తి - చిప్పగిరి

మండలంలోని బెల్డోన గ్రామంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి స్పందన లభించిందని ప్రోగ్రాం మేనేజర్ వాసు, వైద్యులు మల్లికార్జున, మారన్న తెలిపారు. శనివారం బెల్డోన గ్రామంలో కోనంకి సతీష్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు మాట్లాడుతూ... కంటి పరీక్షలు చేయడమే గాక అవసరమైతే ఉచితంగా ఆపరేషన్లు కూడా చేస్తామని తెలిపారు. కంటి ఆపరేషన్ చేయించుకునే వారికి ఉచితంగా బస్సు సౌకర్యం కల్పిస్తున్నామన్నారు. ఈ ఉచిత వైద్య శిబిరాన్ని మండలంలోని అన్ని గ్రామాల్లోనూ నిర్వహిస్తామని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కంటి పరీక్షలు చేయించుకుంటున్న వృద్ధులు

ఘనంగా అయ్యప్ప స్వామి పడిపూజ

ప్రజాశక్తి - ఆస్పరి

మండలంలోని తంగరడోన గ్రామం నల్లారెడ్డి స్వామి దేవాలయం ఆవరణంలో వెలసిన శ్రీఅయ్యప్ప స్వామి 9వ పడిపూజ శనివారం అయ్యప్ప స్వామి భకుల్త ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. గురు స్వాములు గోవిందురాజులు, నరసప్ప స్వామివారి ఆలయంలో అభిషేకం, హోమం, గణపతి హోమం, సుబ్రహ్మణ్య హోమం, అయ్యప్ప హోమం పూర్ణాహుతి నిర్వహించారు. పడిపూజ, భజన, అయ్యప్ప స్వామి పాటలతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. మహా మంగళహారతి తదితర పూజలు చేపట్టారు. సాయంత్రం అయ్యప్పస్వామి ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేక వాహనంలో కూర్చోబెట్టి డప్పులతో పాటలు పాడుకుంటూ గ్రామ పురవీధుల్లో ఊరేగించి, చింతలముని స్వామి ఆలయంలో పూజలు నిర్వహించి యథాస్థానానికి చేరుకున్నారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. నేషనల్ విద్యాసంస్థ, మాజీ సర్పంచి గోపాల్ రెడ్డి, రిటైర్డ్ విఆర్ఒ సీతారామి రెడ్డి, సీనియర్ జర్నలిస్ట్ వెంకన్న, గ్రామ పెద్దలు సిద్ధరామయ్య, వెంకట రామి రెడ్డి, రంగా రెడ్డి, నల్లన్న, సూరి, రంగస్వామి, బసరరాజు, వీరేష్, సాయితేజ, రూపామోహన్, బసవరాజు, ప్రకాష్, నల్లారెడ్డి పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలం : రైతుసంఘం

ప్రజాశక్తి - మంత్రాలయం

రైతులను ఆదుకోవడంలో కూటమి ప్రభుత్వం విఫలం చెందిందని రైతు సంఘం మండల కార్యదర్శి ఎస్.వీరేష్ విమర్శించారు. శనివారం మండలంలోని సూగూరు గ్రామంలో రైతుల సమస్యలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్నాయని, పంటలకు గిట్టుబాటు ధర లేక రైతులు ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. అధిక వర్షాల వల్ల నష్టపోయిన రైతులకు నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం రైతుసంఘం గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా కె.యోగప్ప ఆచారి, కార్యదర్శిగా ఖాసీం, ఉపాధ్యక్షులుగా నాగేష్, కె.బ్రహ్మయ్య, సహాయ కార్యదర్శులుగా సి.రోడ్డ రాముడు, కె.చంద్రప్ప, కమిటీ సభ్యులుగా బి.శివరాముడు, కె.రాగప్ప, కె.నాగేష్, రాముడు, బట్ల రంగన్న, ఆంజనేయ, కె.బైరప్ప, ఖాజావలీ, కమ్మరి మౌనేష్, సి.తాయన్న, సి.గోవిందు, సి.గోపాల్‌తో పాటు 28 మందిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు.

సిఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం

- టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు చెన్నబసప్ప


చెక్కు అందజేస్తున్న నాయకులు

ప్రజాశక్తి - కౌతాళం

సిఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరమని టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు చెన్నబసప్ప పేర్కొన్నారు. శనివారం ఆయన మాట్లాడారు. మండలంలోని ఉప్పరహాల్ గ్రామానికి చెందిన సరోజమ్మ, బాపురం గ్రామానికి చెందిన ఈరమ్మ అనారోగ్యంతో ఓ ప్రయివేట్ ఆస్పత్రిలో చికిత్స పొందారని, వారి వైద్య ఖర్చుల నిమిత్తం దాదాపు రూ.58,375 సిఎం రిలీఫ్ ఫండ్‌ను జిల్లా అధ్యక్షులు తిక్కారెడ్డి సహకారంతో కూటమి ప్రభుత్వం మంజూరు చేసిందని తెలిపారు. వాటికి సంబంధించిన చెక్కులను సరోజమ్మ భర్త గోపాల్ రెడ్డికి, ఈరమ్మ కుమారుడు తిరుమలరెడ్డికి అందజేశారు. జిల్లా కార్య నిర్వాహక కార్యదర్శి కొట్రేష్ గౌడ్, దమ్ములదిన్నె సర్పంచి రమేష్ గౌడ్, సిద్ధు, మంజునాథ్, రాజాబాబు, నరసింహ, చిరుతపల్లి శివప్ప గౌడ్, భీమయ్య, కోడిగుడ్ల రామాంజి, పూగ్గి నాగప్ప పాల్గొన్నారు.

నేడు జోనల్ స్థాయి ఆటల పోటీలు

ప్రజాశక్తి - ఆదోని

విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు ప్రతి ఏడాది రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఆదోని జోనల్ స్థాయి ఇండోర్ ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్లు, ఆదివారం శ్రీమల్లికార్జున విద్యాలయ హైస్కూల్‌లో పోటీలు నిర్వహిస్తున్నట్లు రోటరీ క్లబ్ అధ్యక్షులు డాక్టర్ సైపుల్లా, కార్యదర్శి మేఘనాథ్ రెడ్డి తెలిపారు. శనివారం వారు మాట్లాడారు. ఇండోర్ ఆటల పోటీల్లో భాగంగా చెస్, రూబిక్ క్యూబ్, డ్రాయింగ్, హెలిక్యుషన్, క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పోటీల్లో పాల్గొనే ఆయా పాఠశాలల కరస్పాండెంట్లకు వివరాలు తెలిపినట్లు చెప్పారు. రోటరీ క్లబ్ సభ్యులు జీవన్ సింగ్, సునీల్ రెడ్డి, సోమశేఖర్ రెడ్డి, ప్రశాంత్ గాంధీ, సందీప్ రెడ్డి, సాబీర్ అహ్మద్, హుస్సేన్ బాష పాల్గొన్నారు.

అలారుదిన్నె బ్రిడ్జికి మరమ్మతులు

- తాత్కాలిక మరమ్మతులతో సరి

- నూతన బ్రిడ్జి తక్షణమే నిర్మించాలి : సిపిఎం

ప్రజాశక్తి - ఆస్పరి

బళ్లారి నుంచి కర్నూలు వెళ్లే ప్రధాన రహదారిలో ఉన్న అలారుదిన్నె బ్రిడ్జికి ఆర్‌అండ్‌బి అధికారులు మరమ్మతులు చేపడుతున్నారు. శనివారం సిపిఎం జిల్లా బృందం మరమ్మతులు చేస్తున్న బ్రిడ్జిని పరిశీలించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు కెవి.నారాయణ, జిల్లా నాయకులు వీరశేఖర్ మాట్లాడారు. అలారుదిన్నె బ్రిడ్జి పూర్తిగా దెబ్బతినిందని, తాత్కాలిక మరమ్మతులు చేపట్టడం సరికాదని తెలిపారు. ఈ బ్రిడ్జిపై 30 నుంచి 45 టన్నుల దాకా భారీ వాహనాలు వెళ్తూ ఉంటాయని, అలాంటి బ్రిడ్జికి తాత్కాలిక మరమ్మతులు చేయడం ఏమిటని ప్రశ్నించారు. మరమ్మతులు చేపట్టడం వల్ల ప్రజాధనాన్ని వృథా చేయడమే తప్ప శాశ్వత పరిష్కారం కాదన్నారు. బ్రిటీష్ కాలంలో నిర్మించిన దాదాపు వందేళ్ల బ్రిడ్జికి మరమ్మతులతో సరి పెడితే ఎలా అని మండిపడ్డారు. బ్రిడ్జికి మరమ్మతులు చేపట్టి 8 నెలలు కూడా కాలేదని, అప్పుడే బ్రిడ్జిపై రంధ్రాలు పడ్డాయని, ఇలా ఎంతకాలం మరమ్మతులు చేసుకుంటూ పోతారని ప్రశ్నించారు. నూతన బ్రిడ్జిని నిర్మించి శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. లేకపోతే ప్రజలు, వాహనదారులతో కలిసి ఆందోళనకు పూనుకుంటామని హెచ్చరించారు. సిపిఎం మండల కార్యదర్శి బాలకృష్ణ, సిపిఎం దేవనకొండ మండల నాయకుల అశోక్ పాల్గొన్నారు.

బ్రిడ్జిని పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు

మమ్మల్ని కాపాడండి..!

- వైన్ షాపు యజమాని ఆవేదన

- మద్యం అమ్మకాలపై 20 శాతం మార్జిన్ పెంచాలంటూ విజ్ఞప్తి

ప్రజాశక్తి - నందవరం

మద్యం అమ్మకాలపై 20 శాతం మార్జిన్ పెంచి తమను కాపాడాలంటూ నందవరం గ్రామానికి చెందిన మంజు వైన్ షాప్ యజమాని మాచాని వెంకటేశ్వర్లు కోరారు. సోమవారం ఆయన మాట్లాడారు. ప్రభుత్వం కేటాయించిన 14 శాతం మార్జిన్‌తో షాపులను నిర్వహించలేక అప్పుల భారంతో ఆత్మహత్య చేసుకునే స్థితికి వచ్చామని వాపోయారు. తమ ప్రభుత్వం అంటూ నమ్మి తాము టెండర్లు వేసి మోసపోయామని కన్నీరు పెట్టుకున్నారు. టెండర్లు వేసే సమయంలో 20 శాతం మార్జిన్ ఇస్తామని చెప్పడం వల్లనే టెండర్లు వేశామన్నారు. షాపు ప్రారంభంలోనే ఇచ్చిన మాటను ప్రభుత్వం తప్పి 10 శాతం మార్జిన్‌తో సరుకు ఇచ్చిందని తెలిపారు. ప్రారంభమైన మొదట్లోనే సుమారు రూ.4 లక్షలు నష్టపోయామని ఆవేదన చెందారు. వైన్ షాపు అసోసియేషన్ పోరాటం వల్ల ప్రభుత్వం దిగి వచ్చి మరో 4 శాతం అదనంగా పెంచిందని తెలిపారు. షాపు ప్రారంభం నుంచి ఇప్పటివరకు రూ.35 లక్షల నష్టం వచ్చినట్లు చెప్పారు. నష్టం వచ్చి, విభేదాల వల్ల కొన్ని షాపులు బంద్ అయ్యాయని తెలిపారు. ఎక్సైజ్ శాఖ వారు రిటెండర్‌కు పిలిచినా ఎవరూ ముందుకు రావడం లేదని చెప్పారు. లాభముంటే షాపులు ఎందుకు బంద్ అవుతాయని ప్రశ్నించారు. కొత్తగా పర్మిట్ రూమ్ ఉండాలని ప్రభుత్వ నిబంధన పెట్టిందన్నారు. పర్మిట్ రూమ్ అనుమతి కోసం రూ.9 లక్షలను కట్టమనడం బాధాకరమని తెలిపారు. షాపు నిర్వహణకు అప్పులు, ఉన్న బంగారు తాకట్టు పెట్టినట్లు చెప్పారు. ప్రభుత్వ నిబంధనలు పాటిస్తున్నామని, ప్రభుత్వ మాత్రం తమపై కనికరం చూపించడం లేదని తెలిపారు.

రిఫండ్ చేయకపోవడం దారుణం

- రైతు రవీంద్రారెడ్డి - ప్రత్యేక విద్యుత్ అదాలత్‌లో ఫిర్యాదు

ప్రజాశక్తి - నందవరం

వినతిపత్రం అందజేస్తున్న రైతు

ట్రాన్స్‌ఫార్మర్ క్యాన్సిల్ చేసుకున్నా తనకు రిఫండ్ ఇవ్వకపోవడం దారుణమని పూలచింత గ్రామానికి చెందిన రైతు రవీంద్రారెడ్డి తెలిపారు. తనకు న్యాయం చేయాలంటూ ప్రత్యేక విద్యుత్ అదాలత్‌లో ఫిర్యాదు చేశారు. ఆయన మాట్లాడుతూ... రెండేళ్ల క్రితం పొలంలో బోర్లు వేసుకోవాలని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కోసం దరఖాస్తు చేసుకున్నామని, విద్యుత్ శాఖ వారు ట్రాన్స్‌ఫార్మర్ మంజూరు చేశారని తెలిపారు. దరఖాస్తు చేసేటప్పుడు రూ.35 వేలు కట్టినట్లు చెప్పారు. కొన్ని కారణాల వల్ల ఆ ట్రాన్స్ ఫార్మర్‌ను తాము తీసుకోలేదన్నారు. అప్పుడు నందవరం మండల విద్యుత్ ఎఇ ఫోన్ చేసి 'మీరు ట్రాన్స్‌ఫార్మర్ తీసుకెళ్తారా, మీరు రాకపోతే క్యాన్సిల్ చేస్తామ'ని అన్నారని తెలిపారు. తాము ఆ సమయంలో విద్యుత్ ఎఇని కలిశామని, 'మీకు అవసరం లేకపోతే క్యాన్సల్ చేద్దాం. మీరు కట్టిన డిపాజిట్ అమౌంటు తిరిగి వస్తుంది' అని ఎఇ చెప్పారని గుర్తు చేశారు. పొలం దగ్గర నీరు సరిగా లేదని, క్యాన్సిలేషన్ చేయాలని.. లేఖ రాసి ఇచ్చినట్లు తెలిపారు. మెటీరియల్ ట్రాన్స్‌ఫార్మర్ రిటర్న్ చేసి త్వరలోనే రిఫండ్ చేస్తామని ఆయన చెప్పారని అన్నారు. దాదాపు 8 నెలల తర్వాత ఇప్పుడు 'మీకు అమౌంట్ తిరిగి రాదు. మా ఉన్నతాధికారులు ఒప్పుకోవడం లేద'ని విద్యుత్ శాఖ అధికారులు అంటున్నారని తెలిపారు. ఇన్నేళ్లు వచ్చిన రిఫండ్ అమౌంట్ ఇప్పుడు ఎందుకు రావడం లేదని ప్రశ్నించారు. తన డబ్బులు రూ.35 వేలు ఇప్పించి న్యాయం చేయాలని కోరారు.

సబ్ కలెక్టర్ స్పందనపై రైతుల హర్షం

ప్రజాశక్తి - మంత్రాలయం

భూ సమస్యలపై ఆదోని సబ్ కలెక్టర్ అజయ్ కుమార్ స్పందించడంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు. శనివారం వారు విలేకరులతో మాట్లాడారు. అనుభవంలో ఉన్న భూముల గురించి రైతులకు, శ్రీమఠం యాజమాన్యానికి జరుగుతున్న వివాదం గురించి రైతుల ఫిర్యాదులు స్వీకరించి తహశీల్దార్ కె.రమాదేవిని అడిగి తెలుసుకోవడం సంతోషం కలిగించిందని తెలిపారు. ఇప్పటి వరకు ఏ అధికారి కూడా తమ సమస్యను ఇంత సావధానంగా వినలేదన్నారు. అనుభవంలో ఉన్న భూములకు సంబంధించిన ఈసీలను సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం నుంచి తెప్పించుకుని వాటి ఆధారంగా రైతుల వద్ద భూముల రికార్డులను పరిశీలించిన తనకు వివరాలు రికార్డుల ద్వారా అందజేయాలని, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని పేర్కొన్నారని అన్నారు. తహశీల్దార్ కె.రమాదేవి, కోసిగి తహశీల్దార్ రుద్ర గౌడ్, ఆర్ఐ జనార్దన్ రావు, రైతులు వనికె నాగరాజు, గనేకంటి రఘు, వనికె గురురాజ, పిల్లి భీమేష్, వీరయ్య శెట్టి, అడివప్ప, మేకల వెంకటేష్, ఎం.ప్రవీణ్, సునీల్ కుమార్, అగ్రిబ్ ప్రకాష్ పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న రైతులు

అంబేద్కర్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలి

- ఎమ్మెల్యే బీవీ - ఘనంగా అంబేద్కర్ వర్ధంతి

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

అంబేద్కర్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయనాగేశ్వర రెడ్డి పేర్కొన్నారు. శనివారం ఎమ్మెల్యే బీవీ నివాసంలో కార్యకర్తలతో కలిసి అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే కెవిపిఎస్ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులచారు. కెవిపిఎస్ నాయకులు కోటేకల్ చిన్నప్ప, తిమ్మన్న, ఉపాధ్యక్షులు గుడేకల్ ఆనంద్, ఎర్రకోట అరుణ్, చర్మ కళాకారుల సంఘం టౌన్ వైస్ ప్రెసిడెంట్ మెకానిక్ రాజు మాట్లాడారు. ప్రజా సంఘాల నాయకులు గుడికల్ స్వామి దాసు, కలుగొట్ల వినోద్, సోగనూరు రాముడు, కందనాతి సతీష్, బతకన్న, గంగన్న, చిన్న, ప్రసాద్, రంగస్వామి, బతకన్నా బాబు, ఈరన్న పాల్గొన్నారు. **గోనెగండ్ల** బస్టాండ్ ఆవరణలో అంబేద్కర్ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ రాష్ట్ర కమిటీ సభ్యులు కరుణాకర్ మాట్లాడారు. రాజ్యాంగ పరిరక్షణకు ఐకమత్యంతో పోరు సాగించాలని కోరారు. కెవిపిఎస్ నాయకులు ప్రసాద్, సురేష్, పెద్దయ్య, సిఐటియు మండల కార్యదర్శి నబి రసూల్, కెజిబిఎస్ మండల అధ్యక్షులు మునిస్వామి, ఆటో యూనియన్ నాయకులు విజయ్, రాఘవేంద్ర, వీరన్న గౌడ్, రహీం, బాబు, రాజు, కిట్టు పాల్గొన్నారు. **చిప్పగిరి**, నేమకల్లు గ్రామంలో అంబేద్కర్ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జనసేన మండల అధ్యక్షులు చిరంజీవి, ఎంఆర్‌పిఎస్ మండల అధ్యక్షులు జిఎస్.నెట్టికంటయ్య, నేమకల్లు ఈరన్న, వీరేష్ మాట్లాడారు. యువత అంబేద్కర్ ఆశయాలను ఆచరించి ముందుకు తీసుకెళ్దామని కోరారు. ఎంఆర్‌పిఎస్ సీనియర్ నాయకులు నెట్టికల్లు, వెంకటరమణ, జిఎస్.లక్ష్మీనారాయణ, పి.నారాయణస్వామి, రామాంజని, కిరణ్, బసన్న గారి చంద్రన్న, జిఎస్.లవ్ కుమార్, బలరాం పాల్గొన్నారు. **నందవరం**లో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వైసిపి హాలహర్వి నాయకులు తిమ్మప్ప మాట్లాడుతూ... బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి, సమానత్వానికి అంబేద్కర్ కృషి చేశారని తెలిపారు. **కౌతాళం**, గుడికంబాలి, కామవరం గ్రామాల్లో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జైభీమ్ నాయకులు అవతారం, పాల్ దినకరన్, దళిత సమాఖ్య నాయకులు గుడి కంబాలి మారెప్ప, ఎంఆర్‌పిఎస్ మండల అధ్యక్షులు ఆనంద్, వైసిపి యువ నాయకులు సుబ్బరాజు పాల్గొన్నారు. **ఆదోని**లోని పాతబస్టాండ్ కూడలిలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జై భీమ్ నాయకులు సురేష్ బాబు, బండారి మారెన్న, శంకర్, భీమ్ యూత్ సెక్రటరీ నాగరాజు, జనరల్ సెక్రటరీ విజయ్, శంకర్, జై భీమ్ కార్యకర్తలు మారెన్న, అమలనాథ్ ఉన్నారు. **ఆస్పరి** చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహానికి నారాయణ ప్రైమ్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ డైరెక్టర్ దీప్తి ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉపాధ్యాయులు ఖలీల్, సతీష్, ఈశ్వర్, నీలకంఠ, త్రివేణి, పవిత్ర, పద్మావతి, అశ్విని, నరసింహ, విద్యార్థులు పాల్గొన్నారు. **హోళగుంద**లోని సీజనల్ హాస్టల్‌లో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఉషోదయ గ్రామీణాభివృద్ధి సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు సిహెచ్.నాగరాజు, ఉపాధ్యాయులు సోహెబ్, దుర్గయ్య పాల్గొన్నారు. **మంత్రాలయం** ఆర్‌టిసి బస్టాండ్ సమీపంలో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జై భీమ్ ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు చిక్కం జానయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి గర్జి హనుమన్న, జిల్లా కార్యదర్శి మాదిగ రత్నం, ఆదోని డివిజన్ ఉపాధ్యక్షులు సంఘటి యోహాను, మంత్రాలయం నియోజకవర్గ నాయకులు దేవరపాటి అనిల్ కుమార్, మారెన్న, నాగేంద్ర, మంత్రాలయం మండల అధ్యక్షులు గాడిమోడీ నరసింహులు, కార్యదర్శి గర్జి ప్రకాష్, స్టూడెంట్ ఆర్గనైజర్ మద్రి రాజు, అడివి రాజు, ఎరుకుల సంఘ నాయకులు వీరేష్, చిక్కం లాజరు, చిక్కం భూపతి, రామచిలకల జయరాజ్, ఎంపిటిసి చిక్కం చిన్న, మామిడి నాగేష్, రామచిలకల విజయ్ కుమార్, మామిడి పెద్ద ముక్కరన్న, చిక్కం జోసెఫ్, చిక్కం మూర్తి, రామచిలకల జగన్, రామచిలకల దుబ్బన్న, డప్పు కళాకారుడు చిక్కం ఏసేపు, నరసింహులన్న, ఏసు, ప్రసాద్, తిక్కయ్య, చంద్రయ్య, బండారి మనోహర్ పాల్గొన్నారు.

నందవరం

ఎమ్మిగనూరులో నివాళులర్పిస్తున్న నాయకులు

గోనెగండ్లలో నివాళులర్పిస్తున్న నాయకులు


కౌతాళం

ఆదోని

IN THE COURT OF THE HON'BLE CIVIL JUDGE (SENIOR DIVISON) ADONI

I.P.No. 2/2022

Uppari Narasimhulu .....Petitioner
Vs
Katika Sivaji & others ...Respondents

GENERAL NOTICE

Whereas the above named petitioner filed petition under section 10 of Provincial Insolvency Act to declare the petitioner as insolvent. Hence anybody has got any wants any objection with regard to the above petition are hereby appear before this court on.27.01.2026 at 10.30 AM and answer the said petition and also anybody wants any objection to appear before this court, otherwise the petition will be decided exparte.

(By Court order)

P Rajendra Prasad,
Advocate, Adoni
Cell No.9440596447

IN THE COURT OF THE HON'BLE CIVIL JUDGE (SENIOR DIVISON) ADONI

I.P.No. 6/2022

E. Venkatesulu .....Petitioner
Vs
D. Khaseem Bee & Others ...Respondents

GENERAL NOTICE

Whereas the above named petitioner filed petition under section 10 of Provincial Insolvency Act to declare the petitioner as insolvent. Hence anybody has got any wants any objection with regard to the above petition are hereby appear before this court on. 29.12.2025 at 10.30 AM and answer the said petition and also anybody wants any objection to appear before this court, otherwise the petition will be decided exparte.

(By Court order)

P Rajendra Prasad,
Advocate, Adoni
Cell No.9440596447

IN THE COURT OF THE ADDL SENIOR CIVIL JUDGE KURNOOL
A.S NO.17/2021

S.Mohammed Husain. ...Appilent
-VS-
1) Pedda Venkateswarlu
2) Chinna venkateswarlu (died) his LRS Renukabai and others. ...Respondents

NOTICE TO R3 TO R6

R3: Renukabai w/o Chinna venkateswarlu
R4: Hemalatha
R5: Sumalatha
R6: Pawan Kumar

All are children's of late Chinna venkateswarlu R/o Panchalingala village, Kurnool Mandal and district.

పై నెంబరు అప్పీలలో అప్పిలెంట్ కర్నూలు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు కర్నూలు ఓ.ఎస్. నెంబర్ 409/2023, 10.07.2019 తేదీ తీర్మానము మేరకు పై నెంబరు అప్పీలు దాఖలు చేసినారు. ఈ అప్పీలులో 3 నుండి 6 రెస్పాండెంట్లు అయినా మిమ్ములను ఐ.ఎ.52/2024, 10.09.2025 తేదీన అర్జీ ప్రకారము రెస్పాండెంట్లుగా చేర్చినారు. ఇందులో 3 నుండి 6 రెస్పాండెంట్లు అయిన మీకు ఆక్షేపణలు ఉన్న 18.12.2025 తేదీన పగలు 10:30 గంటలకు పైకోర్టులో హాజరై తెలుపుకొనవలయును. లేని యెడల మీ పరోక్షమున విచారించి తీర్మానించబడును.

(కోర్టు వారి ఉత్తర్వులు మేరకు)

ఐ.జోసఫ్,
కె.కృష్ణమోహన్ రెడ్డి,
అప్పిలెంటుపరం అడ్వకేట్లు, కర్నూలు.
ఫోన్ నెంబర్ : 9440553789

IN THE COURT OF THE III-ADDITIONAL JUNIOR CIVIL JUDGE-CUM-SPECIAL MOBILE COURT, KURNOOL
O.S.No. 76/2025

Smt R. Vimala. ...Plaintiff
Versus
P.Nagendram and anothers. ...Defendants

1, 2వ ప్రతివాదులకు దావా సమన్లు

1) పి.నాగేంద్ర తండ్రి పి.గిరిజాపతి
2) కె.జి.ప్రసునాంబ భర్త పి.నాగేంద్ర
ఇద్దరి ఇంటి నెం.87/998,
రాజేశ్వరి నగర్, కర్నూలు.

పై నెంబర్ దావాలో వాది, ప్రతివాదుల పైన ప్లైంట్‌లో కనపరచిన 1,2 అంశములపైన, (ప్లైంట్ దాఖల ఆస్థి పైన)

a) to direct the defendant to redeem the plaint schedule property by re-conveying the plaint schedule property in favour of the plaintiff,
b) to award costs of the suit;

దావా దాఖలు చేసినాడు. ఇందులో 1,2 ప్రతివాదులు అయిన మీకు ఆక్షేపణ ఉన్న 24-12-2025 తేదిన పగలు 10.30 గంటలకు పై కోర్టులో హాజరై తెలుపుకొనవలయును. లేని యెడల మీ పరోక్షమున విచారించి తీర్మానింపబడును.

షెడ్యూలు :

As per plan the plots are made over the land bearing Sy No.65/2A & 65/2C of Mamidalapadu Village, under the limits of Stantanpuram Panchayathi Area, Kurnool Mandal, Kurnool District within the Sub-Registration District of Kurnool and Registration District of Kurnool out of the said plots, Plot No. 14 has been purchased by the plaintiff from one D. Srinivasulu through sale deed dated 26-08-2008 and the same has been registered in her favour at Book No. 1, vide document No.7638 of 2008 at Kurnool Registrar Office, onwards the property is in her possession and enjoyment of the same and its constructed place measurements.

The land admeasuring 25 feet or 7.62 Sq.meters towards East-West and admeasuring 75 feet or 22.86 Sq. meters towards North-South totally the land admeasuring 1875 Sq Feet or 208.33 Sq Yards of land is bounded as follows:

East : Land belongs to others
West : Place of Plot No. 13
North : Part of land in the same survey number belongs to D. Srinivasulu
South : 30 feet width Road.

In between the land admeasuring 208.33 Sq. Yards of land issued by the Stantanpuram Gram Panchayath authority vide D.Dis. No. 101/5/2008-2009, dated: 09-02-2009 and its to be constructed building as per plan and its 208.33 Sq. Yards of open place and its to be constructed first floor (as per Physical Possession) at 1/3 place ie, 1500 Sq feet of building is bounded as follows

East : 3% feet width balcony
West : Open place of the building
North : Open place of the building
South : Open place of the building

And its steps the place between the boundaries of first floor only The said entire property market value is Rs 10,50,000/-only

(కోర్టు వారి ఉత్తర్వు మేరకు)

సయ్యద్ యం.డి.మీర్‌షా ఖాద్రి,
యం.గోపాల్ శెట్టి,
వాది పరం అడ్వకేట్లు, కర్నూలు.

లబ్ధిదారులకు అవగాహన కల్పిస్తున్న జిల్లా ఉన్నతాధికారులు

త్వరితగతిన పక్కా గృహాలు నిర్మించుకోవాలి : పీడీ

ప్రజాశక్తి - ఆత్మకూరు

ఆత్మకూరు పట్టణంలో పిఎంఎవై-1.0 పథకం కింద ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు పక్కా గృహాలను త్వరితగతిన పూర్తి చేసుకోవాలని జిల్లా గృహనిర్మాణ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ హరిగోపాల్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నాగరాజు, ఎఇ ఉమా మహేశ్వర రెడ్డి తెలిపారు. పట్టణంలో పిఎంఎవై కింద వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్న పక్కా గృహాలను వారు శనివారం పరిశీలించి మాట్లాడారు. ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసుకోవడానికి బీసీ, ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులకు అదనపు ఆర్థిక సహాయం కింద నిధులు అకౌంట్లలో జమయినందున పక్కా గృహాలను త్వరితగతిన పూర్తి చేసుకోవాలని వారు లబ్ధిదారులకు సూచించారు. మార్చి 2026 నాటికి గృహ నిర్మాణాలు పూర్తి చేసుకోవాలని లబ్ధిదారులకు అవగాహనా కల్పించారు. పిఎంఎవై-2.0లో మంజూరై నిర్మాణంలో ఉన్న గృహాలను తనిఖీ చేసి వార్డు అమినీటీస్ సెక్రటరీలకు తగు సూచనలు చేశారు. కార్యక్రమంలో వార్డ్ అమినిటీస్ సెక్రటరీ, వర్క్ ఇన్‌స్పెక్టర్లు రామకృష్ణ, సుబ్బలక్ష్మమ్మ పాల్గొన్నారు.

చెంచు గిరిజన మహిళలకు చీరలు పంపిణీ

చీరలు పంపిణీ చేస్తున్న తెలుగు విశ్వవిద్యాలయం పీఠాధిపతి

ప్రజాశక్తి - శ్రీశైలం ప్రాజెక్ట్

శ్రీశైలం దేవస్థానం పరిధిలో ఉన్న మల్లమ్మ కన్నీరు వెనక భాగాన నివాసం ఉంటున్న 20 చెంచు గిరిజన మహిళలకు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా తెలుగు యూనివర్సిటీ పీఠాధిపతి డాక్టర్ ముసుగు శ్రీనివాసరావు శనివారం చీరలు పంపిణీ చేశారు. నిరుపేదలైన 20 మంది చెంచు గిరిజన మహిళలకు చీరలు పంపిణీ చేయడానికి ఆహ్వానించడమే కాకుండా కొమరం భీం ఆదివాసి చెంచు గిరిజన సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షులు వై. ఆశీర్వాదం, దాసరి అంకన్న, వీరయ్య, తెలుగు యూనివర్సిటీ ఎంప్లాయిస్ హాజరు అయ్యారు. చీరలు పంపిణీ చేయడం పట్ల చెంచులు తెలుగు విశ్వవిద్యాలయం విభాగానికి కృతజ్ఞతలు తెలిపారు.

క్రీడలకు పుట్టినిల్లు ఆత్మకూరు : రేడియం నూర్

రాష్ట్రస్థాయి నైట్ వాలీబాల్ టోర్నమెంట్ కరపత్రం విడుదల చేస్తున్న క్రీడాకారులు

ప్రజాశక్తి - ఆత్మకూరు

క్రీడలకు ఆత్మకూరు పట్టణం పుట్టినిల్లు అని, రాష్ట్రంలోనే మంచి గుర్తింపు ఉందని ఆత్మకూర్ స్పోర్ట్స్ క్లబ్ గౌరవ అధ్యక్షులు రేడియం నూర్ తెలిపారు. పట్టణంలో ఈ నెల 8, 9న నిర్వహించే రాష్ట్రస్థాయి నైట్ వాలీబాల్ టోర్నమెంట్‌కు సంబంధించిన కరపత్రాన్ని ఆయన క్రీడాకారులతో కలిసి శనివారం విడుదల చేశారు. టోర్నమెంట్‌లో విశాఖపట్టణం, విజయవాడ, గుంటూరు, రాజమండ్రి, కర్నూలు, నంద్యాల జిల్లాల వాలీబాల్ జట్లు పాల్గొంటాయన్నారు. క్రీడలకు, క్రీడాకారులకు అన్ని విధాల సహకరిస్తున్న ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. టోర్నమెంట్‌లో పాల్గొనే జట్లకు మొదటి బహుమతి రూ. 12వేలు, రెండో బహుమతి రూ. 7వేలు, మూడో బహుమతి రూ. 5వేలు ఇవ్వనునట్లు తెలిపారు. వీటితోపాటు క్రీడాకారులకు భోజన వసతి కల్పించనున్నారు. విజయవాడకు చెందిన 'జనంలో మనం స్వచ్ఛంద సేవ సంస్థ' చైర్మన్ పొదిగింటి నాగరాజు బహుమతుల నగదు, భోజన వసతి సౌకర్యాన్ని అందించనున్నారు. కార్యక్రమంలో ఆత్మకూర్ స్పోర్ట్స్ క్లబ్ చైర్మన్ పస్పిల్ మున్నా, ఖోఖో శిక్షకులు మెహబూబ్, క్రీడాకారులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను నిర్మూలిద్దాం

ప్రజాశక్తి - కొలిమిగుండ్ల

బాల్య వివాహాలను నిర్మూలిద్దామని జిల్లా బాలల సంరక్షణ విభాగం నంద్యాల(ఒఆర్‌డబ్ల్యు) సి. సునంద కుమారి పేర్కొన్నారు. కొలిమిగుండ్లలోని కస్తూర్బా గాంధీ పాఠశాలలో స్పెషల్ ఆఫీసర్ లక్ష్మీ సరోజ అధ్యక్షతన శనివారం నిర్వహించిన సమావేశానికి ముఖ్య అతిథిగా ఆమె హాజరై మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం 'బాల్య వివాహ రహిత ఆంధ్ర ప్రదేశ్'పై పిల్లలకు, అంగన్వాడీ కార్యకర్తలకు అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పిల్లల హక్కుల గురించి, ఫోక్సో చట్టం, బాల్య వివాహంతో జరిగితే నష్టాలపై వివరించి అందరిచే ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ పీవీ శివమ్మ, కెజిబివి ఉపాధ్యాయులు మహబూబ్, జాన్, వెంకటలక్ష్మి, రజిని, జరీనా, అంగన్వాడీ కార్యకర్తలు పద్మావతి, రేణుక, త్రివేణి, శ్రీలక్ష్మి, భాగ్యలక్ష్మి, రామలక్ష్మితోపాటు వివిధ గ్రామాల అంగన్వాడీ కార్యకర్తలు, విద్యార్థినులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో వ్యక్తి మృతి

పజాశక్తి - బేతంచర్ల

బేతంచర్ల మండలం ఆర్ఎస్ రంగాపురం గ్రామ నివాసి వైసీపీ కార్యకర్త నీలకంటి మద్దిలేటి స్వామి(56) అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, మాజీ సర్పంచ్ జగన్ మోహన్ రెడ్డి మృతుని ఇంటికి వెళ్లి భౌతిక కాయానికి పూలమాల వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఎంపీపీ మాట్లాడుతూ వైసిపి నాయకులు, కార్యకర్తలకు ఎటువంటి ఇబ్బందులు వచ్చినా, అనుకోకుండా అనారోగ్యంతో లేదా ఇతర కారణాలతో మరణించిన వారి కుటుంబాలను పార్టీ తప్పకుండా ఆదుకుంటుందన్నారు. కార్యక్రమంలో వైసీపీ మండల కన్వీనర్ కుంచే తిరుమలేశ్వర్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి సీతారామ చంద్రుడు, రంగాపురం మాజీ సర్పంచి జగన్మోహన్ రెడ్డి, ఎద్దుల అన్న పాల్గొన్నారు.

నివాళులర్పిస్తున్న ఎంపిపి బుగ్గన నాగభూషణం రెడ్డి

రెడ్‌క్రాస్‌ను బలోపేతం చేయాలి : కలెక్టర్

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ రాజకుమారి

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

జిల్లాలో రక్త కొరత రాకుండా రక్తదానంపై అవగాహన కార్యక్రమాలు, ర్యాలీలు నిర్వహించాలని, రెడ్‌క్రాస్‌ను బలోపేతం చేయాలని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి కమిటీ సభ్యులకు సూచించారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా కమిటీ సమావేశం జిల్లా రెడ్ క్రాస్ బ్లడ్ స్టోరేజ్ సెంటర్ (కేసీ కెనాల్ కాంపౌండ్)లో జిల్లా కలెక్టర్, రెడ్ క్రాస్ జిల్లా అధ్యక్షులు జి.రాజకుమారి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ప్రతి పాఠశాలలో జూనియర్ రెడ్ క్రాస్ (జెఆర్‌సి) యూనిట్లను, ప్రతి కళాశాలలో యూత్ రెడ్ క్రాస్ (వైఆర్సి) బృందాలను ఏర్పాటు చేసి దాదాపు లక్ష మంది విద్యార్థులను సభ్యులుగా నమోదు చేసుకోవాలని సూచించారు. విద్యార్థులకు వివిధ సామాజిక అంశాలపై శిక్షణ ఇచ్చి రెడ్ క్రాస్ కార్యకలాపాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలా చర్యలు తీసుకోవాలన్నారు. భవిష్యత్తులో విపత్కర పరిస్థితులలో సేవలందించేందుకు రెడ్ క్రాస్ వాలంటీర్ సైన్యాన్ని సిద్ధం చేయాలన్నారు. వైద్యుల సహకారంతో చెంచు గిరిజన ప్రాంతాల్లో వైద్య శిబిరాలు నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. రెడ్‌క్రాస్ సభ్యత్వాలను పెంచాల్సిన అవసరం ఉందన్నారు. సమావేశంలో చైర్మన్ దస్తగిరి పర్ల, వైస్ చైర్మన్ డాక్టర్ మమతా రెడ్డి, కోశాధికారి నాగేశ్వరరావు, కార్యవర్గ సభ్యులు డాక్టర్ నిషిత రెడ్డి, డాక్టర్ అరుణకుమారి, ఉస్మాన్ భాషా, పేరు సోముల నరసింహమూర్తి, తెలకపల్లి రాధాకృష్ణ, యాకూబ్ తదితరులు పాల్గొన్నారు.

వికలాంగుల అభివృద్ధికి ఇంద్రధనస్సు పథకాలు : మంత్రి

ప్రజాశక్తి - నంద్యాల

రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇంద్రధనస్సు పేరుతో ప్రకటించిన ప్రత్యేక పథకాలు వికలాంగుల సంక్షేమం, అభివృద్ధికి దోహదం చేస్తాయని రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ పేర్కొన్నారు. ఇంద్రధనస్సు పథకాలు ప్రకటించిన నేపథ్యంలో వికలాంగుల సంక్షేమ సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు డాక్టర్ రవికృష్ణ, అధ్యక్షులు ఎంపివి. రమణయ్యలు మంత్రి ఫరూక్‌ను శనివారం ఆయన క్యాంపు కార్యాలయంలో కలిసి కూటమి ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. మంత్రిని సంఘం ప్రతినిధులు శాలువాతో సత్కరించారు. నంద్యాల జిల్లాగా ఏర్పడినప్పటికీ వికలాంగుల శాఖ కార్యాలయం కర్నూలు ఉమ్మడి జిల్లాకు కలిపి ఒకటే కర్నూలులో ఉందని, నంద్యాలలో కార్యాలయం ఏర్పాటు చేసి అధికారులను నియమించాలని వారు మంత్రిని కోరారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు హనీ ఖాన్, కరీముల్లా, లయన్స్ క్లబ్ సభ్యులు వాసు, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

శాంతిరామ్ మెడికల్ కళాశాల విద్యార్థినికి గోల్డ్ మెడల్

అవార్డు ప్రదానం చేస్తున్న మిద్దె శాంతి రాముడు

ప్రజాశక్తి - పాణ్యం

శాంతి రామ్ మెడికల్ కాలేజ్ అండ్ జనరల్ హాస్పిటల్ వారు నంద్యాలలో సైకియాట్రీ విభాగానికి చెందిన ఉత్తమ అవుట్ గోయింగ్ పీజీ విద్యార్థులకు 2024 నుండి ప్రతి సంవత్సరం బంగారు పతకం అందించే కార్యక్రమాన్ని సైకియాట్రీ విభాగాధిపతి డాక్టర్ పి.వి.ఎస్.మూర్తి స్పాన్సర్‌గా ప్రారంభించారు. ఈ సంవత్సరానికి గాను డాక్టర్ పి.వి.ఎస్.మూర్తి బెస్ట్ అవుట్ గోయింగ్ పీజీ గోల్డ్ మెడల్‌ను సైకియాట్రీ విభాగానికి చెందిన డాక్టర్ యం.కవితకు ప్రదానం చేశారు. ఈ అవార్డు ప్రదాన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆర్‌జీఎం, శాంతిరామ్ గ్రూప్ ఛైర్మన్ ఎం.శాంతిరాముడు ఎం.కవితకు బంగారు పతకాన్ని అందించారు. కార్యక్రమంలో వైస్ ఛైర్మన్ ఎం.మాధవి లత, ప్రిన్సిపల్ వసంత్ ఆర్.చవాన్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ యం.రాఘురాం, మేనేజింగ్ డైరెక్టర్ పి.రఘుబాబు, మెడికల్ సూపరింటెండెంట్ ఎం.మధుసూదన్ రెడ్డి, ఆర్ఎంఓ కె.నరేంద్రుడులు యం.కవితకు శుభాకాంక్షలు తెలిపారు..

నేడు ముత్యాలపాడులో క్రీడా పోటీలు

ప్రజాశక్తి - చాగలమర్రి

మండలంలోని ముత్యాలపాడు గ్రామంలో ఎస్పీజి చర్చి 133వ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం ఉదయం 10 గంటలకు వాలీబాల్, సాయంత్రం 7 గంటలకు షటిల్ పోటీలను నిర్వహించనున్నట్లు కన్వీనర్ ఎం.డేవిడ్ శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రెవ.జి.వి. చంద్రశేఖర్, ఆళ్ళగడ్డ రూరల్ సిఐ డి.మురళీధర్‌రెడ్డి, చాగలమర్రి ఎస్ఐ సురేస్‌లు హాజరు కానున్నట్లు తెలిపారు. వాలీబాల్‌లో ప్రథమ స్థానం జట్టుకు రూ.30,000 నగదు బహుమతిని

దాతలు విక్టర్ దేవదానం(బిఎస్ఎఫ్), బేతం ఓబన్న ఎస్ఐ వల్లూరు, ఎస్ఐలు ఇయన్ జె కెనడి . వీర ప్రతాప్‌లు, ద్వితీయ స్థానం జట్లకు రూ.15,000 నగదు బహుమతిని దాతలు కడపకు చెందిన ఎం. శేఖరయ్య, జి.ఐజయ్య, దండు షంతోష్ కుమార్‌లు అందజేస్తున్నారన్నారు. షటిల్ పోటీల్లో ప్రథమ స్థానం జట్టుకు రూ.5000లు, ద్వితీయ బహుమతి రూ.3,000, తృతీయ బహుమతి రూ.2,000 నగదును ఎసిపిజి చర్చి కమిటీ వారు అందజేస్తారన్నారు. వాలీబాల్ అడే జట్టుకు ఎంట్రీ ఫీజు రూ.1000, షటిల్‌కు రూ.200లు ఎంట్రీ ఫీజు చెల్లించాలన్నారు. పోటీల్లో పాల్గొనే జట్ల సభ్యులకు భోజన ఏర్పాట్లు చేశామన్నారు. వాలీబాల్ బాల్ జట్టు వారే తెచ్చుకోవాలని సూచించారు.

రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

కర్నూలు నగర పరిధిలోని వీకర్ సెక్షన్ కాలనీ కోడుమూరు రోడ్డు సమీపంలోని ఎల్లమ్మ గుడి నుంచి కాలనీ చివర బీసీ కాలనీ చర్చి వరకు ప్రధాన రోడ్డును వేయాలని ఐద్వా ఆధ్వర్యంలో కర్నూలు కార్పొరేషన్ కమిషనర్ పి.విశ్వనాథ్‌ను కలిసి వినితి పత్రం అందజేశారు. మహిళా సంఘం నాయకులు రోడ్డు దుస్థితిని కమిషనర్‌కు వివరించారు. కమిషనర్ స్పందిస్తూ రోడ్డు వేసేందుకు చర్యలు తీసుకుంటామని, మున్సిపల్ కార్పొరేషన్ ఎస్‌ఈ ఈ రోడ్డు నిర్మాణానికి అవసరమైన అంచనాలను తయారు చేయమని ఆదేశించారు. ఐద్వా సీనియర్ నాయకులు మాజీ కార్పొరేటర్ ఎన్ అలివేలు, ఐద్వా జిల్లా అధ్యక్షురాలు ఎస్. శ్యామల నాయకులు అనసూయ, గోహర్ పాషా, సహదాబి తదితరులు వినతిపత్రం ఇచ్చిన వారిలో ఉన్నారు.

క్రీడలు ఏకాగ్రతను పెంచుతాయి

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్ : క్రీడలు చదువుతో ఏకాగ్రతను సమస్యలను పరిష్కరించే జ్ఞాపకశక్తిని మెరుగుపరుస్తాయని ఎజిఎం రమేష్ కుమార్ సూచించారు. శనివారం కర్నూలు స్థానిక ఎలుకూరు బంగ్లాలోని నారాయణ పాఠశాల ఆవరణలో జిల్లాస్థాయి నారాయణ ప్రీమియర్ లీగ్ (ఎన్‌పిఎల్) పోటీల ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఏజీఎం రమేష్ కుమార్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి క్రీడల్లో భాగస్వామ్యం కావాలని కోరారు. క్రీడా పోటీలకు లో గెలుపొందిన క్రీడాకారులకు మెమొంటో, ధ్రువపత్రాలు అతిథుల చేతులు మీదుగా అందజేశారు. క్లస్టర్ ప్రిన్సిపల్స్ అన్వర్ భాష, రామాంజనేయులు శ్రీనివాసరెడ్డి, ఆర్ఎస్ టి ప్రకాష్, హైస్కూల్ కో ఆర్డినేటర్ భాగ్యలక్ష్మి, శ్రీహరి పాల్గొన్నారు.

లక్ష్యానికి విరుద్ధంగా 'పోతిరెడ్డిపాడు-బనకచర్ల' కాంప్లెక్స్

ప్రజాశక్తి - నంద్యాల

రాయలసీమ సాగునీటి అవసరాల కోసం కీలకంగా నిర్మించిన పోతిరెడ్డిపాడు-బనకచర్ల కాంప్లెక్స్ లక్ష్యానికి విరుద్ధంగా నడుస్తున్న నేపథ్యంలో సక్రమ దిశగా నడిపించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షులు బొజ్జా దశరథరామిరెడ్డి జిల్లా కలెక్టర్ జి.రాజకుమారికి విజ్ఞప్తి చేశారు. శనివారం సమితి కార్యవర్గ సభ్యులతో కలిసి జిల్లా కలెక్టర్‌ను కలిసి బనకచర్ల కాంప్లెక్స్ నుండి కృష్ణాజలాల పంపిణీకి సంబంధించిన సంక్షిప్త నోటును అందజేశారు. బనకచర్ల క్రాస్ రెగ్యులేటర్ కాంప్లెక్స్ నుండి రాయలసీమకు నీరు అందించాల్సిన వ్యవస్థ పూర్తిగా దారితప్పిన విషయాన్ని సవివరంగా ఆయన కలెక్టర్‌కు వివరించారు. కలెక్టర్ స్పందిస్తూ రాయలసీమ ప్రాజెక్టులకు సక్రమంగా నీరు అందించడానికి అవసరమైన చర్యలపై సమగ్ర నివేదికను ప్రభుత్వానికి పంపిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రాయలసీమ సాగునీటి సాధన సమితి ఉపాధ్యక్షులు యర్రం శంకర్ రెడ్డి, ప్రచార కార్యదర్శి నిట్టూరు సుధాకర్ రావు, సభ్యులు భాస్కర్ రెడ్డి అడ్వకేట్ అసదుల్లా మియా పాల్గొన్నారు.

ప్రాంతాలు, భాషలు వేరైనా మనమంతా ఒక్కటే

- శ్రీ సంకల్ప్ విద్యాసంస్థల అధినేత సుధాకర్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

భారతదేశంలో ప్రాంతాలు, భాషలు వేరైనా మనమంతా ఒక్కటేనని శ్రీ సంకల్ప్ విద్యాసంస్థల అధినేత సుధాకర్ పేర్కొన్నారు. శనివారం నంద్యాల పట్టణం సంజీవనగర్‌లోని శ్రీ సంకల్ప్ పాఠశాలలో'కల్చరల్ ఎక్స్‌ట్రావగంజా' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థినీ విద్యార్థులు వివిధ వేషధారణలతో అద్భుత ప్రదర్శనలు ఇచ్చి ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమానికి శ్రీ సంకల్ప్ విద్యాసంస్థల అధినేత సుధాకర్, పట్టణ ప్రముఖ గైనకాలజిస్ట్ కల్పనా రెడ్డిలు ముఖ్య అతిథులుగా విచ్చేశారు. విద్యార్థుల అద్భుత ప్రదర్శనలు ఎంతో సంతోషాన్ని ఇచ్చాయని అభిప్రాయం వ్యక్తం చేశారు.

అంతర్ కళాశాలల టోర్నమెంట్ ప్రారంభం

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

నగరంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో అంతర్ కళాశాలల టోర్నమెంట్ పోటీలు శనివారం నుండి ప్రారంభమయ్యాయి. క్లస్టర్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ వెంకట బసవరావు టోర్నమెంట్ పోటీలను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థుల మానసిక, శరీరక ఎదుగుదలకు క్రీడలు దోహద పడతాయని క్లస్టర్ యూనివర్సిటీ పరిధిలోని మూడు కళాశాలల విద్యార్థులు ఈ పోటీలలో చురుకుగా పాల్గొనాలని తెలిపారు. రిజిస్ట్రార్ డాక్టర్ జి.శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థి దశ నుండే స్పోర్ట్స్ అండ్ గేమ్స్ లో ముందుండాలని, క్రీడలు విద్యార్థుల సమగ్ర వికాసానికి దోహదపడతాయన్నారు. మూడు కళాశాలల విద్యార్థులకు మంచి ఆట స్థలాలు ఉన్నాయని, విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.ఇందిరా శాంతి, వ్యాయమ విభాగాధిపతి వై. శ్రీనివాస్ రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్స్ జె.హేమంత్, ఎ.సత్యనారాయణ పాల్గొన్నారు.

అంగన్వాడీలకు కనీస వేతనం రూ.26 వేలివ్వాలి

ప్రజాశక్తి -కోడుమూరు

అంగన్వాడీలకు కనీస వేతనం రూ.26 వేలివ్వాలని సిఐటియు మండల అధ్యక్షులు జిపి.వీరన్న, అంగన్వాడీ నాయకులు అరుణ, రజియా, హైమావతి కోరారు. శనివారం ఐసిడిఎస్ కోడుమూరు ప్రాజెక్ట్ ఆఫీస్‌లో సీనియర్ అసిస్టెంట్ ముర్తుజాకు వినతిపత్రం అందజేశారు. ఈనెల 12న కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాకు అంగన్వాడీ టీచర్లు, ఆయాలు తరలి రావాలని కోరారు. చంద్రమ్మ, సుజాత, సువర్ణ పాల్గొన్నారు.

నాణ్యత ప్రమాణాలు తప్పనిసరి

- అన్న క్యాంటీన్లలో కమిషనర్ విశ్వనాథ్ ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

నగరంలోని అన్నక్యాంటీన్లలో ఆహార నాణ్యత ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్ నిర్వాహకులను ఆదేశించారు. శనివారం ఆయన కొండారెడ్డి బురుజు, కలెక్టరేట్ అన్న క్యాంటీన్లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆహార నాణ్యత, పరిసరాల పరిశుభ్రత, నీటి వసతి, సిబ్బంది వ్యక్తిగత పరిశుభ్రత, వినియోగించే పదార్థాల నిల్వ విధానాలను సమగ్రంగా పరిశీలించారు. అనంతరం రిజిస్టర్‌లో సంతకం చేసి రిమార్కులను నమోదు చేశారు. ఆహార నాణ్యతను రోజూ పరిశీలించి తన దృష్టికి తీసుకోరావాలని నోడల్ అధికారులను ఆదేశించారు. సంబంధిత పారిశుధ్య తనిఖీదారుడు రోజూ విధిగా స్వచ్ఛత పనులు చేపట్టాలని సూచించారు. వంటశాలలో పాత్రలు, వంట సామగ్రి, ప్లేట్లు, గ్లాసులు ప్రతి వాడుకకు ముందు, తర్వాత శుభ్రం చేయాలని తెలిపారు.

మూల మృత్తిక బృందావన ప్రతిష్ఠాపన శుభపరిణామం

- శ్రీమఠం పీఠాధిపతులు సుభుదేంద్ర తీర్థులు

ప్రజాశక్తి - సిబెళగల్

మండలంలోని కొత్తకోటలో గురు రాఘవేంద్ర స్వామి ఆలయ పునః ప్రారంభం, శిలా మండపం మూల మృత్తిక బృందావన ప్రతిష్ఠాపన శుభపరిణామమని శ్రీమఠం పీఠాధిపతులు సుభుదేంద్రతీర్థులు తెలిపారు. శనివారం ఆలయ పునః నిర్మాణం, ప్రతిష్ఠాపనకు ఆయన అంకురార్పణ చేశారు. పునః నిర్మాణం చేపట్టిన ఆలయ పూర్వపు పూజారి తులసి దాస్ వంశస్తులు లక్ష్మణ దాసు కుటుంబీకుల సమక్షంలో ప్రతిష్ఠాపన అనంతరం పీఠాధిపతులు మాట్లాడారు. 70 ఏళ్ల క్రితం తులసి దాసు మంత్రాలయం రాఘవేంద్ర స్వామి ఆజ్ఞ మేరకు హరిజన సముదాయకులు ఎకరా పొలం విరాళంగా ఇవ్వడంతో ఆలయం నిర్మించారని తెలిపారు. అలంపూర్ మాజీ ఎమ్మెల్యే కొత్తకోట ప్రకాష్ రెడ్డి, సర్పంచి శ్రీనివాసులు, గ్రామ పెద్దలు రాజశేఖర్ పాల్గొన్నారు.

నూతన డైనింగ్ హాల్ ప్రారంభించిన వీసీ

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

క్లస్టర్ విశ్వవిద్యాలయం పరిధిలోని సిల్వర్ జూబ్లీ కళాశాల విద్యార్థినుల హాస్టల్‌లో శనివారం నూతన డైలింగ్ హాల్‌ను వీసీ వెంకట బసవరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యార్థులకు పరిశుభ్రమైన వాతావరణంలో ఆహారాన్ని వడ్డించాలని కోరారు. రిజిస్ట్రార్ డాక్టర్ జి.శ్రీనివాస్, డీన్‌లు డాక్టర్ నాగరాజ్ శెట్టి, డాక్టర్ అక్తర్ భాను, డాక్టర్ మహ్మద్ వాహిజ్, డిప్యూటీ వార్డెన్లు డాక్టర్ ఫమిదా బేగం, ఎం.పార్వతి పాల్గొన్నారు.

హెల్మెట్ లేకుండా వాహనం నడపడం నేరం

- కర్నూలు ట్రాఫిక్ సిఐ మన్సూరుద్దీన్

ప్రజాశక్తి - కర్నూలు క్రైమ్

హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనాలు నడపడం నేరమని కర్నూలు ట్రాఫిక్ సిఐ ఎస్.మన్సూరుద్దీన్ తెలిపారు. శనివారం నగరంలోని కిసాన్ ఘాట్ సమీపంలో హెల్మెట్ ధారణపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. హెల్మెట్ ధరించని ద్విచక్ర వాహనదారులను ఆపి కౌన్సెలింగ్ ఇచ్చి, జరిమానా విధించారు. అక్కడికక్కడే చలానాలు వసూలు చేశారు. మరి కొంతమందికి హెల్మెట్లను తీసుకొచ్చి ధరించాకే వాహనాలను వదిలిపెట్టారు. సిఐ మాట్లాడుతూ... హెల్మెట్లు వ్యక్తిగత భద్రతకు ఎంతో అవసరమన్నారు. ఆర్ఎస్ఐ రమేష్ పాల్గొన్నారు.

సిఎం, ఎమ్మెల్యే చిత్రపటాలకు పాలాభిషేకం

ప్రజాశక్తి - పత్తికొండ

ఈనెల 3న అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి ఏడు వరాలను ప్రకటించడం పట్ల పట్టణంలోని నాలుగు స్తంభాల కూడలి దగ్గర వికలాంగుల జిల్లా అధ్యక్షులు ఎల్లప్ప, సిద్ధార్థ వికలాంగుల మండల సమైక్య సభ్యులు ఉరుకుందమ్మ, శ్రీనివాసులు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, పత్తికొండ ఎమ్మెల్యే కెఇ.శ్యామ్ కుమార్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. వారు మాట్లాడుతూ.... ముఖ్యమంత్రి చంద్రబాబు వికలాంగులను ఆదుకుంటున్నారని తెలిపారు. పత్తికొండ గర్ల్స్ హైస్కూల్ విద్యా కమిటీ ఛైర్మన్ వడ్డే రామాంజనేయులు, సోమన్న, రంగస్వామి, శేషయ్య, కృష్ణయ్య, నారాయణ, రామన్న, మద్దిలేటి, సూరి, రంగన్న పాల్గొన్నారు.

ఉల్లి రైతులను ఆదుకోవాలి : రైతు సంఘం

ప్రజాశక్తి - పత్తికొండ

ఉల్లి పంట సాగు చేసి నష్టపోయిన రైతులను ఆదుకోవాలని రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి డి.రాజా సాహెబ్ డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలో ఆర్‌డిఓ భరత్ నాయక్‌ను కలిసి రైతు సంఘం మండల కార్యదర్శి సిద్దు ఆధ్వర్యంలో రైతు సంఘం నాయకులు వినతి పత్రం అందజేశారు. సిపిఐ మండల కార్యదర్శి కారుమంచి, రైతు సంఘం గౌరవాధ్యక్షులు కారన్న, సిపిఐ పట్టణ కార్యదర్శి రామాంజనేయులు, వెంకటరామిరెడ్డి, పెద్ద ఈరన్న, కాశీ, నెట్టకంటయ్య, రాజప్ప పాల్గొన్నారు.

హ్యాండ్ బాల్ విజేత కర్నూలు జట్టు

ప్రజాశక్తి - కర్నూలు జిల్లాపరిషత్

కర్నూలు జిల్లా హ్యాండ్ బాల్ సంఘం ఆధ్వర్యంలో గత రెండు రోజులుగా నిర్వహించిన 11వ రాష్ట్రస్థాయి సీనియర్ పురుషుల హ్యాండ్ బాల్ పోటీల విజేతగా కర్నూలు జిల్లా జట్టు నిలిచిందని పోటీల నిర్వాహక కార్యదర్శి డాక్టర్ రుద్ర రెడ్డి తెలిపారు. ఫైనల్స్‌లో వైజాగ్ జిల్లా జట్టుపై కర్నూలు జిల్లా జట్టు 19-16 గోల్స్ తేడాతో గెలుపొంది ఛాంపియన్‌గా నిలిచింది. రెండవ స్థానంలో వైజాగ్ నిలువగా,మూడవ స్థానంలో వెస్ట్ గోదావరి జట్టు, ఈస్ట్ గోదావరి జిల్లా జట్లు సంయుక్తంగా నిలిచాయి. శనివారం స్టేడియంలో ఏర్పాటు చేసిన బహుమతుల ప్రధానోత్సవ కార్యక్రమానికి జిల్లా క్రీడల ఇంఛార్జి అభివృద్ధి అధికారి భూపతిరావు, జిల్లా ఒలంపిక్ సంఘం సీఈవో విజయకుమార్, ఒలింపిక్ కార్యనిర్వ కార్యదర్శి సునిల్ కుమార్ , అంతర్జాతీయ హ్యాండ్ బాల్ క్రీడాకారుడు వెంకటేష్, సీనియర్ క్రీడాకారుడు ఫణీంద్ర హాజరై బహుమతులను ప్రదానం చేశారు.

ఎర్ర బ్యాడ్జీలతో ఆర్‌టిసి కార్మికుల నిరసన

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

ఎపిఎస్ఆర్‌టిసి కర్నూలు-2 డిపోలో సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలపై డిపో కార్యదర్శి మహేశ్వరరావు ఆధ్వర్యంలో శనివారం మొదటిరోజు ఎర్ర బ్యాడ్జీలు ధరించి నిరసన చేపట్టారు. నాయకులు మాట్లాడుతూ... డిపోలో సమస్యలు పెరిగిపోతున్నాయని, పరిష్కరించాలని కోరారు. అక్రమ సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని, చార్ట్ కౌన్సెలింగ్ నిర్వహించాలని తెలిపారు. గూడూరు, ఎమ్మిగనూరు రోడ్డులో బెళగల్ వద్ద రోడ్డు పనులు జరుగుతున్నందున, ట్రాఫిక్ జామ్ అయి సర్వీసులు ఎంత ఆలస్యమైనా తిరగాలని సిబ్బందిని వేధించడం మానుకోవాలని తెలిపారు. డిపో అధ్యక్షులు జివి.రెడ్డి, కోశాధికారి శివకేశన్న, మెయింటెనెన్స్ కమిటీ సభ్యులు రామకృష్ణ, జాయింట్ సెక్రటరీలు ఈఎస్.గౌడ్, కృష్ణ, మద్దిలేటి, శేఖర్ పాల్గొన్నారు.